


రిపబ్లిక్ డే.. జనవరి 26నే ఎందుకు..?



నవతెలంగాణ-అంబర్‌పేట

భారత దేశంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవంగా ప్రతీ ఏటా జరుపుతుంటారు. అయితే ఈ రిపబ్లిక్ డేను జనవరి 26నే ఎందుకు నిర్వహిస్తారో ఇప్పటికీ చాలా మందికి తెలియదు అంటే అతిశయోక్తి కాదు. ఇది సాధారణ సెలవు రోజు కాదు. స్వాతంత్ర భారతావని మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 26న 21 ఫిరంగుల సెల్యూట్ స్వీకరించడంతో పాటూ, భారత జాతీయ జెండాను ఎగురవేసి దేశాన్ని సంపూర్ణ గణతంత్ర దేశంగా ప్రకటించారు.

వ్యాపారం కోసం దేశానికి వచ్చిన ఆంగ్లేయులు.. నాటి పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకున్నారు. దేశంలోని అనైక్యతను ఆసరగా చేసుకుని క్రమంగా పట్టుసాధించారు. రాజ్యాలు, సంస్థాలుగా ఉన్న భారతావనిని.. విభజించు పాలించు విధానం అవలంభించి అధికారం హస్తగతం చేసుకున్నారు. దాదాపు 2 శతాబ్దాలు పాటు ఆంగ్లేయులు పాలనలో ఉన్న భరతమాతకు.. సుదీర్ఘ పోరాటం తర్వాత 1947లో విముక్తి లభించింది. దేశ స్వాతంత్రం కోసం వేలాది మంది ధన మాన ప్రాణత్యాగాలు చేశారు. అహింస అనే ఆయుధంతో భారతీయులను ఒక్కతాటిపైకి తీసుకొచ్చిన గాంధీ.. జాతీయ ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించారు.

అయితే 1947 ఆగస్టు 15న స్వాతంత్ర వచ్చినా 1950వ దశకంలోనే దేశానికి సంపూర్ణ స్వరాజ్యం సిద్ధించింది. స్వాతంత్రం తర్వాత గణతంత్ర దేశంగా 1950 జనవరి 26న భారత్ అవతరించింది. అదే రిపబ్లిక్ డే.. అయితే, దీని ప్రాముఖ్యత తెలియని జనానికి ఇదొక సాధారణ సెలవు రోజు. సరదాగా ఇంటి పట్టున ఉంటూ సినిమాలు, షికార్లు, షాపింగ్‌లతోనూ కాలక్షేపం చేస్తారు. దేశ స్వాతంత్రం కోసం ఎన్నో త్యాగాలు చేసి తమ ప్రాణాలనే తణప్రాయంగా భావించి, స్వరాజ్య యజ్ఞంలో సమిధలైన గొప్ప వ్యక్తులను ఈ రోజు ఎంత మంది స్మరిస్తున్నారు? జాతీయ సెలవు రోజున ఎంత మంది వారి ఆదర్శాలను వల్లించుకుంటున్నారు? దేశ స్వాతంత్రం మీద నేటి యువతకి ఎంత అవగాహన ఉంది? అన్న అంశాలపై ఎవరైనా సర్వే నిర్వహిస్తే సిగ్గుతో తలదించుకునే విషయాలు బయటపడతాయి.

1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది... కాబట్టి ఏటా అదే తేదీన రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని భావిస్తారు. ఇందులో కాస్త నిజం లేకపోలేదు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. లాహెూర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా పూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అప్పటి దాకా కేవలం రాజకీయ, ఆధ్యాత్మిక స్వాతంత్రం వస్తే చాలు, సంపూర్ణ అధి కారం బ్రిటిష్ వారి చేతుల్లోనే ఉండి, దేశం సామంత రాజ్యంగా మిగిలి పోయినా ఫర్వాలేదనుకునేలా ఉన్న రాజకీయ నేతల వైఖరిని జలియన్‌వాలాబాగ్ ఉదంతం ఒక్కసారిగా కండ్లు తెరిపించింది. నాడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించి పూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రకటన చేయించడంలో సఫలమ య్యారు. ఆ రోజునే స్వాతంత్ర్య దినోత్స వంగా పరిగణించాల్సిందని కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు పిలుపు కూడా ఇచ్చింది. అంతటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న తేదీకి చిరస్థాయి కల్పించాలన్న సదుద్దేశంతో నవభారత నిర్మాతలు మరో రెండు నెలలు ఆగి 1950 జనవరి 26

మిగితా 2లో..

రిపబ్లిక్ డే.. జనవరి 26నే ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చారు.

జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలంనాటి భారత ప్రభుత్వ చట్టం - 1935 రద్దయ్యింది.. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటుచేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ చైర్మెన్‌గా డాక్టర్ అంబేడ్కర్‌ను నియమించారు. రాజ్యాంగ రచనకు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలం పట్టింది. మొత్తం రూ.64 లక్షలు ఖర్చయ్యింది.

భారత రాజ్యాంగానికి 1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం అయినప్పటికీ, అందులోని అనేక అంశాలను ఇతర రాజ్యాంగాల నుంచి గ్రహించారు. బ్రిటీష్ పరిపాలన నుంచి విముక్తి పొందిన తరువాత భారత పౌరులందరిని ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేసి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇది జనవరి 26, 1950 నుంచి అమలులోకి వచ్చింది. ఈ రోజున భారత ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం, న్యాయాన్ని పూర్తి స్థాయిలో ఒక హక్కుగా పొందారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

మంచినీటి శాశ్విత సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నానని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ పరిధిలోని జమల్ బస్తీలో రూ. 10 లక్షల నిధులతో వేయనున్న మంచి నీటి పైప్ లైన్ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి అధికారులను ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జమల్ బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించవలసిందిగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాచిగూడ డివిజన్ లోని అన్ని సమస్యలను తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని అలాగే ప్రజల విజ్ఞప్తి మేరకు త్వరలోనే విద్యుత్ వైర్లను కూడా మార్చే పనులు చేపడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సన్యాసి రావు, ఏఈ భావన, జీహెచ్‌ఎంసీ ఏఈ దివ్య, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాచిగూడ డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మ దేవ్, సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, ప్రధాన కార్యదర్శి కె సదానందు, నాయకులు సుభాష్ పటేల్, విజితా రెడ్డి, మన్నె శ్రీనివాస్ యాదవ్,బద్దుల శ్రీకాంత్ యాదవ్, శ్రావణ్ యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- మల్కాజిగిరి



ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వారికి వివరించారు. అంతకు ముందు మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో అధికారులతో ఎమ్మెల్యే కలిసి నాలా పనులను పరిశీలించారు. ల్యాండ్ ఓనర్ తో మాట్లాడి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ డిసి రాజు,ఎం ఆర్ ఓ వెంజటేశ్వరులు,ఈ ఈ లక్ష్మణ్,జలమండలి జీఎం సునీల్ కుమార్, డిఈ మహేష్ ఏఈ మధురిమా,మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్,పిట్ల శ్రీనివాస్,సత్తయ్య, చందు, సంతోష్ రాందాస్, మబ్బు, గౌలికర్, షకిల్, గౌలికర్ శైలేందర్ ,సంతోష్ నాయుడు, ఆదినారాయణ,పిట్ల నాగరాజు, కాలని వాసులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజాస్వామ్య దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని ఈ విషయంలో ప్రతి యువతీ, యువకులు తప్పకుండా తమకు సంబంధించి ఓటు హక్కును నమోదు చేసుకొని ఎన్నికల సమయంలో ఓటును తప్పకుండా వినియోగించుకోవాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు.

బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శామీర్‌పేటలోని జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యా నాయక్, అధికారులు, సిబ్బందితో కలిసి ఓటరు ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు 25 జనవరి 2011 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరిం చారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని ఓటు హక్కు వజ్రాయుధమని తెలిపారు. ఓటర్లుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటింగ్ సమయంలో తప్పకుండా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు యువతీ, యువకులు 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని.. వారు తప్పకుండా ఓటు వేసేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, సీపీవో రాంమోహన్, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్అండ్ బి శ్రీనివాస్ మూర్తి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఫలితంగానే ఉన్నత స్థాయికి

- రాష్ట్ర పర్యటక అభివద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోలు



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఫలితంగానే నేడు వెనుకబడిన వర్గాల వారు చట్టసభల్లో, రాజకీయాల్లో, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరగలుగుతున్నారని రాష్ట్ర పర్యటక అభివద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్య భారతదేశం ఒక తాటిపై నిలిచిం దంటే అది రాజ్యాంగం వల్లే సాధ్యమైందని తెలిపారు. భారత ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో సమానత్వం లభించేలా, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేలా ఆనాడు అంబేద్కర్ సారథ్యంలో ఎన్నో వ్యయ ప్రయా సలకు ఓర్చి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి పూర్తిస్థాయి రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రజలకు రక్షణ కవచాలుగా మార్చారన్నారు. జీవించే హక్కు, చట్టం అందరికి సమానంగా ,రక్షణ హక్కు స్వేచ్ఛ, దోపిడి నిరోధించే, మత స్వేచ్ఛ, అణగారిన వర్గాల రక్షణ హక్కులకు భంగం కలిగితే నేరుగా దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ను ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ప్రాథమిక హక్కులే పునాదులన్నారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలుపరిచిన తర్వాత స్వతంత్ర భారతదేశ సర్వసత్తాక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా అవతరించిందని, దీంతో ప్రతి సంవత్సరం జనవరి 26 న గణతంత్ర దినంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని వివరించారు. భారత ప్రభుత్వం నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి, అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించిందని చెప్పారు. శాసన వ్యవస్థ, కార్యనిర్వాక వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో కూడా రాజ్యాంగం నిర్దేశిస్తుందని తెలిపారు.



స్కూల్‌లో ఆటపాటలు

నవతెలంగాణ-కాప్రా

గణతంత్ర దినోత్సవం సందర్భంగా బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ఈసీఐఎల్ బ్రాంచ్‌లో బుధవారం పిల్లలకు ఆటపాటలు, డ్యాన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మశ్రీ స్కూల్ స్టాఫ్ శైలజ, వసంత , సిబ్బంది పాల్గొన్నారు.



ఐడిపిఎ చర్లపల్లి లోని హాజ్రత్ మకదూమ్ మొహిద్దిన్ షా బాబా మజీద్ అవరణలో ఉర్సే-ఏ-షరీఫ్ ఉత్సవాలకు మాజీ మేయర్ రామ్మోహన్ ,స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాప్రా

కీసర అమరవీరుల స్థూపం వద్ద ఓటరు ప్రతిజ్ఞ



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కీసరలోని అమరవీరులస్తూపం వద్ద ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ఆర్డీవో కార్యాల యం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇప్పుడు ప్రతీ ఏడాదికి నాలుగు సార్లు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఓటరుగా నమోదుకు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి బిఎల్ఓలను సంప్రదించి ఓటరు నమోదుకు ఫామ్ - 6 తో పాటు, ఫామ్ - 6బి ద్వారా ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోని, ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుం డా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకొని మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నటయితే మన నియోజకవర్గాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని చక్కగా అభివృద్ధి పరచుకోగలుగుతామన్నారు . ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ రాగుల బాలయ్య, చిలుక గట్టయ్య ని ఘనంగా సన్మానించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఓ ,శ్రీనివాసులు, జిల్లా యువజన సంక్షేమాధికారి బాల్ రాం, కీసర తహసిల్దార్ గౌరివస్థలా, కీసర సర్పంచ్ మాధురి, వైస్ జెడ్పీ చైర్మెన్ బెస్త వెంకటేశ్, కీసర ఎంపీపీ ఇందిరా, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీటీ సీలు, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం-ముఖ్యాంశాలు-రాజ్యాంగ పీఠిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశ పరిపాలన రాజ్యాంగం ప్రకారం పాలించబడాలి. చట్టం ముందు అందురూ సమానమే. నిజానికి స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని, సౌహార్ద్ర, సౌభ్రాతృత్వాన్ని జీవితాశయాలుగా, ఒక జీవన విధానంగా గుర్తిస్తున్నది. ఈ లక్షణాలు ఒకదానితో మరొకటి విడదీయలేనివి. స్వాతంత్ర్యం, సమానత్వం రెండూ విడదీయలేనివి. సమానత్వం, స్వాతంత్ర్యం రెండూ సౌభ్రాతృత్వంతో విడదీయలేనివి. సమానత్వంలేని పక్షంలో స్వాతంత్ర్యం అతికొద్ది మంది ఆధిపత్యాన్ని మిగతా వారి మీద రుద్దుతుంది. స్వాతంత్ర్యం లేని సమానత్వం వ్యక్తిగత అభిప్రాయాన్ని తొక్కేస్తుంది. సౌభ్రాతృత్వం లేని సమానత్వం/స్వాతంత్ర్యం సహజ పరిపాలనకు బహుదూరం. అయితే నేటి పరిస్థితుల్లో రాజ్యాంగం గురించి చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో జరుపుకుంటున్న 74వ గణతంత్ర్య దినోత్సవానికి ఎంతో ప్రత్యేకత ఉంది. చాలా మంది పౌరులకు రాజ్యాంగం గురించి, రాజ్యాంగంలోని ముఖ్యాంశాలపై అవగాహన కరువైంది.

రాజ్యాంగ పీఠిక పాఠ్యం

భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి, వారందరిలో వ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మన రాజ్యాంగపరిషత్‌లో 1949, నవంబర్ 26వ తేదీన ఎంపిక చేసుకుని, శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం.

సర్వసత్తాక :

భారతదేశం ఒక సర్వసత్తాక దేశం. అనగా దేశంలోని అన్ని వ్యవహారాలు దేశమే సలుపగలదు. బయటివారెవరూ దేశ వ్యవహారాలను నిర్దేశించలేరు. దేశంలోని అన్ని వ్యవహారాలు అనగా కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం దేశాన్ని నడిపిస్తుంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, క్షేత్ర ప్రభుత్వాలు, క్షేత్ర స్థాయి న్యాయస్థానాలు, రాష్ట్ర స్థాయి న్యాయస్థానాలు సహకరిస్తాయని అర్థం.

సామ్యవాదం :

ఈ పదం 42వ రాజ్యాంగ సవరణలో చేర్చినప్పటికీ, రాజ్యాంగంలోని కొన్ని ఆదేశిక సూత్రాల ద్వారా మొదటి నుంచి మన దేశం సామ్యవాద దేశమేనని తెలుస్తున్నది. సామ్యవాదమంటే రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య సామ్యవాదమని అర్థం. సామ్యవాద లక్ష్యాలను ప్రజాస్వామ్య పద్ధతిలో, సహజ పరిణామగతిలో, అహింసాపరంగా సాధించాలి. సామ్యవాద దేశంలో సంపాదనను, సంపదను సమానంగా ప్రజలకు పంచాలి. అతికొద్ది మంది చేతుల్లో డబ్బు, పరపతి, సంపద ఉండిపోకూడదు. భూమి, పరిశ్రమల, పెట్టుబడులపై ప్రభుత్వం నియంత్రణ చేస్తూ అందరికీ సమాన హక్కు ఉండేలా చూడాలి.

లౌకిక దేశం :

లౌకిక దేశమనగా ప్రజలకు, ప్రభుత్వానికి గల అనుసంధానం కేవలం రాజ్యాంగం, చట్టం, న్యాయం ద్వారా ఉండాలి. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదం పీఠికలోకి చేర్చబడింది. ప్రజల మతాల ఆధారంగా ఎక్కువ తక్కువలు ఉండవు. అన్ని మతాలు సమానంగా గౌరవించబడతాయి. దేశానికి అధికార మతమంటూ ఏదీలేదు. పౌరులందరూ వారికి ఇష్టమున్న మతాన్ని నమ్మి, ఆచరించి, పెంపొందించుకోవచ్చు.

ప్రజాస్వామ్యం :

భారతదేశంలో ప్రజలే ప్రభువులు. అందువలన భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం. ప్రజల నుంచే పాలకులు ఎన్నికల విధానం ద్వారా ఎన్నుకోవడం జరుగుతంది. ఒక వ్యక్తి - ఒక ఓటు అనే సిద్ధాంతంపై భారత ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. భారతదేశ పౌరుడై, 18 ఏండ్లు నిండిన ప్రతి వ్యక్తి, చట్టం ద్వారా నిలుపుదల లేని సందర్భంలో, ఓటు వేసే హక్కును పొందుతాడు. ప్రజాస్వామ్యం కేవలం రాజకీయపరంగానే కాకుండా సామాజిక, ఆర్థికపరంగా కూడా అన్వయించుకోవాలి.

గణతంత్రం/లోకతంత్రం :

గణతంత్ర ప్రభుత్వంలో, దేశాధినేతను ప్రజలే ఎన్నుకుంటారు. వారసత్వ రాచరికంగానో, నియంత నియంత్రణలోనో ఉండదు. ఈ పదం చెప్పేదేమిటంటే ప్రభుత్వం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఒక పరిమిత కాలం వరకు ప్రజల ద్వారా నేరుగా గానీ, పరోక్షంగా గానీ, దేశాధినేతను ఎన్నుకుంటారు.

సామాజిక న్యాయం :

సామాజిక న్యాయమనగా సమాజంలో ఎలాంటి పైతరగతి వర్గాలు ఉండకపోవటమే. కుల, సంప్రదాయ, మత, వర్ణ, లింగ, స్థాన భేదాల ఆధారంగా ఎవరినీ ఎక్కువ తక్కువ చేసి చూడకూడదు. సమాజంలోని అన్ని రకాల దోపిడీలను నిర్మూలించడమే భారతదేశ పంథా.

ఆర్థిక న్యాయం :

ఆర్థిక న్యాయమనగా జీతం, ఆస్తులు, ఆర్థిక హోదా ఆధారంగా స్త్రీ, పురుషుల మధ్య ఎలాంటి వ్యత్యాసాన్ని చూపకపోవడం. అందరికీ సమానంగా సంపద పంచుతూ, ఆర్థిక సమానత్వం తెస్తూ, వస్తువుల తయారీ-పంపిణీలలో ఏకాధిపత్యాన్ని నిర్మూలిస్తూ, ఆర్థిక వనరులను వికేంద్రీకరిస్తూ, అందరికీ ఆర్థికంగా బాగుపడేందుకు సమాన అవకాశాలను అందివ్వడమే భారత ప్రభుత్వ లక్ష్యం. తద్వారా అందరికీ గౌరవంగా జీవనోపాధి సంపాదించుకునేందుకు అవకాశాలివ్వాలి.

రాజకీయ న్యాయం :

రాజకీయ న్యాయమనగా సమానంగా, స్వేచ్ఛగా, న్యాయంగా అవకాశాలు ప్రజలకు కల్పిస్తూ వారిని రాజకీయాలలో పాల్గొనేలా చేయడం. ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా రాజకీయ హక్కులు ప్రదానం చేయటమే లక్ష్యం. భారత రాజ్యాంగం భారత పౌరులందరికీ రాజకీయాల్లో పాల్గొనే హక్కును, స్వేచ్ఛను అందించే ఉదార ప్రజాస్వామ్యాన్ని అందిస్తున్నది.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని షిర్డీ హిల్స్ బ్లాక్-ఏ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులుగా గెలుపొందిన సిహెచ్.దాసు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి శేషులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘాల ఐక్యతతో కాలనీలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎల్లవేళలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు మారయ్య తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు భిన్నత్వంలో ఏకత్వం నా దేశ ప్రత్యేకత అని, బాల్యంలో విద్యార్థి దశలో ఉన్నప్పుడు అక్షరాల కంటే ముందు ప్రతిజ్ఞ నేర్పింది నాబడి. దానికి నేను గర్వపడుతున్నాను. నేనే కాదు భారతదేశంలో పుట్టిన ప్రతి భారతీయుడు ఈ ఉన్నతమైన లక్షణంతో గర్వపడుతున్నాం. అందుకే కాబోలు ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారతీయ యువ కెరటం స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసంలో ప్రపంచంలో ఎక్కడి నుండి వచ్చినవారికైనా నా భరత మాత చోటిస్తుంది. అమ్మలా ఆదరిస్తుంది అని సగర్వంగా రొమ్ము విరుచుకుని చెప్పిన మాటలు నేటికీ భారతీయుల చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. వెయ్యి సంవత్సరాల ముస్లింల పాలనలో మత సామరస్యం వెల్లివిరిసింది. దేవాలయాల్లో ముస్లిం ప్రార్థనలు మసీదులలో హిందూ దేవతల ప్రతిమలు నా దేశ భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీకలు. అందుకే నా భరత భూమి నాకు గర్వకారణం. రెండు వందల సంవత్సరాలు పాలించిన బ్రిటీషు తెల్ల దొరలను తరిమికొట్టేందుకు హిందూ, ముస్లిం భాయి భాయి అంటూ చేయి చేయి కలిపి బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని సముద్రపు సరిహద్దులు దాటించేదుకు చేసిన త్యాగాలు అనేకం. బంగారు భవిష్యత్తు నిర్మాణానికై దేశ సమగ్రత సౌభాగ్యానికి ప్రజలందరూ ఐక్యతకై సంస్కృతి, సాంప్రదాయాలు, విశ్వాసాలు కాపాడుకునేందుకు ఐక్యంగా నిర్మించుకున్న భారత రాజ్యాంగం నేడు ధ్వంసం అవుతోంది. నాటి కలలు కల్లలు అవుతున్నాయి. దేశభక్తి అంటే దేశంలో భక్తి పేర విధ్వంసం సృష్టించడం ప్రజలను అభద్రతాభావం కల్పించడం అని అర్థం మారిపోయింది. ఈ క్షణంలో ప్రతి భారతీయుడు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

భారత రాజ్యాంగం - ముఖ్య లక్షణాలు :

1949 నవంబర్ 16న ఆమోదం పొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతలు ఆధునిక ప్రపంచంలోని తాత్విక పునాదులను అనుసరించారు. ఉదారవాదం, ప్రజాస్వామ్య సామ్యవాదం, లౌకికవాదం, గాంధీవాదం మొదలైన మూలసూత్రాలను రాజ్యాంగంలో పొందుపర్చారు. సమన్యాయ పాలన, ప్రాథమిక స్వేచ్ఛలు ప్రజలకు ఉండాలని భావించారు. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరగాలని ప్రతిపాదించారు. వీటన్నింటి ఆధారంగా రాజ్యాంగ మౌలిక లక్షణాలు రూపొందాయి. కానీ అవి నేడు దేశ భక్తి పేరుతో పెను ప్రమాదంలో చిక్కుకున్నాయి.

లిఖిత, విపుల రాజ్యాంగం :

ప్రపంచంలో భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు తీసుకుంది. భారతదేశంలోని భిన్నత్వం. అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించాలనే దృక్పథం రాజ్యాంగంలో కనిపిస్తుంది.

రాజ్యాంగ పీఠిక :

భారత రాజ్యాంగ లక్ష్యాలను పీఠికలో పొందుపర్చారు. పీఠికలో 'భారతదేశ ప్రజలమైన మేము' మా దేశాన్ని 'సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా' పేర్కొన్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక, సమగ్రత అనే పదాలను నూతనంగా చేర్చారు. దీంతో పీఠిక 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా' రూపొందింది. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం చేకూరాలని పీఠిక చెప్పింది. ప్రజలకు స్వేచ్ఛ కల్పించడానికి రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు. ప్రజలకు సమానత్వం కల్పించడానికి రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. భారతదేశంలో రాజ్యాధినేత ఎన్నుకోబడడంతో దేశం గణతంత్ర రాజ్యంగా రూపొందింది. పౌరులకు మత స్వేచ్ఛను కల్పించడంతో లౌకిక రాజ్యంగా ఉంది. భారతదేశంలో అధికారానికి మూలాధారం ప్రజలు అని పీఠిక తెలిపింది.

రాజ్యాంగ మౌలిక స్వరూపం :

భారత రాజ్యాంగపరిషత్ రాజ్యాంగంలో మౌలిక స్వరూపం గురించి పేర్కొనలేదు. కానీ 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని వివరించి, దాన్ని కాపాడుకోవాలని చెప్పింది. వివిధ కేసుల్లో జస్టిస్ సిక్రీ, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హెగ్డే మొదలైనవారు తీర్పులను పరిశీలిస్తే రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు తెలుస్తాయి. రాజ్యాంగ ఆధిక్యత, ప్రజాస్వామ్య, సమాఖ్య విధానం, లౌకిక విధానం, సమన్యాయం, సార్వభౌమాధికారం. మొదలైనవాటిని మౌలిక లక్షణాలుగా పేర్కొన్నారు. మినర్వా మిల్స్ కేసు (1980), వామనావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1981) కేసుల్లోనూ సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూప ప్రాధాన్యతను తెలిపింది.

ప్రాథమిక హక్కులు :

రాజ్యాంగం మూడో భాగంలో 12 నుంచి 35 వరకు ఉన్న నిబంధనల్లో ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత పౌరులకు స్వేచ్ఛను కల్పించడానికి ఈ హక్కులు దోహదపడతాయి. సుప్రీం కోర్టు 32వ నిబంధనల ద్వారా హైకోర్టు 226వ నిబంధన ద్వారా పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి ఐదు రకాల రిట్లు జారీ చేస్తాయి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21-ఎ నిబంధన చేర్చి ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా పొందుపర్చారు. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులు తాత్కాలికంగా సస్పెండ్ అవుతాయి. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ప్రకటించకుండానే దేశంలో నిత్యం ఎమర్జెన్సీ కొనసాగుతుంది అనడంలో సందేహం లేదు.

ఆదేశిక సూత్రాలు :

రాజ్యాంగం నాలుగో భాగంలో 36 నుంచి 51 వరకూ ఉన్న నిబంధనల్లో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. ఆదేశిక సూత్రాలు భారతదేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా రూపొందించడానికి తోడ్పడతాయి. భారత ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వీటికి న్యాయస్థానాల సంరక్షణ ఉండదు. సంపద పంపిణీ, సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు సౌకర్యాలు మొదలైన అనేక అంశాలను ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చారు. అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు, తమ రాజకీయ సిద్ధాంతాలతో నిమిత్తం లేకుండా ఆదేశిక సూత్రాలు అమలు చేయాల్సి ఉంటుంది.

ప్రాథమిక విధులు :

ఇప్పుడు రాజ్యాంగంలో 11 ప్రాథమిక విధులున్నాయి. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం, హింసను విడనాడడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలు ప్రాథమిక విధుల్లో ఉన్నాయి. భారత పౌరుల్లో బాధ్యతాయిత ప్రవర్తనను పెంపొందించే ఆశయంతో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు.

పార్లమెంటరీ ప్రభుత్వం :

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పార్లమెంటరీ తరహా ప్రభుత్వం కొనసాగుతుంది. సమిష్టి బాధ్యత, కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించడం పార్లమెంటరీ విధానం యొక్క ముఖ్య లక్షణాలు. కానీ కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి జమ్మూకాశ్మీర్ ప్రజల, రాష్ట్ర శాసనసభ యొక్క అభిప్రాయం తీసుకోకుండానే ఆ రాష్ట్రాన్ని రద్దు చేసింది.

స్వతంత్ర న్యాయవ్యవస్థ :

భారత రాజ్యాంగం దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. న్యాయవ్యవస్థ న్యాయ సమీక్ష అధికారాన్ని కలిగి ఉంటుంది. ఐదు దశాబ్దాలుగా న్యాయవ్యవస్థ క్రియాశీలకంగా కొనసాగుతోంది. దేశంలో పౌరుల ప్రాథమిక హక్కులును కాపాడడంలో న్యాయవ్యవస్థ క్రియాశీలక పాత్ర వహిస్తోంది. ఇటీవల కాలంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ప్రాధాన్యత తగ్గిపోయింది. కొన్నికోర్టు తీర్పులును అధికార వర్గాలు ప్రభావితం చేస్తున్నాయన్న అభిప్రాయాలకు రాక తప్పడంలేదు.

సమాఖ్య, ఏకకేంద్ర లక్షణాలు :

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ భారతదేశాన్ని ఏక కేంద్ర స్ఫూర్తితో పనిచేస్తున్న సమాఖ్య రాజ్యంగా వర్ణించారు. ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు కే.సీ.వేర్ భారతదేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించాడు. ఏకకేంద్ర లక్షణాలైన ఒకే పౌరత్వం, ఏకీకృత న్యాయవ్యవస్థ, అఖిల భారత సర్వీసులు పాత్ర, కేంద్ర ఆధిక్యత మొదలైనవి కూడా రాజ్యాంగంలో ఉన్నాయి. సార్వజనీన వయోజన ఓటు హక్కులను భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వజనీన ఓటు హక్కు ప్రసాదించింది. స్త్రీ, పురుషులందరికీ కుల, మత, వర్గ, లింగ, జాతి బేధాలు లేకుండా 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం సాధించడంలో ఓటు హక్కు ముఖ్యపాత్ర పోషిస్తుంది అని, రాజ్యాంగ నిర్మాతలు ప్రజలందరికీ ఓటు హక్కు ఇవ్వడం ద్వారా ప్రజా సార్వభౌమాధికారం కొనసాగుతుందని విశ్వసించారు. కానీ, డబ్బు ఉన్నవారే రాజ్యాన్ని చేజిక్కించుకొని తమ పెట్టుబడులను విస్తరించుకుంటు ప్రజలను నిరుద్యోగులుగా, పేదవారిగా ఉపాధి కోసం, ఎన్నికలు సమయంలో నాయకులు విసిరే ఎంగిలి మెతుకుల కోసం అమలు కాకపోయినా ఉచిత హామీలు కోసం ఎదురు చూసే నిర్భాగ్యులుగా మార్చివేయబడ్డారు. రైతు గిట్టుబాటు కోసం కాకుండా, నిరుద్యోగి ఉపాధి కోసం కాకుండా, కార్మికుడు కనిస వేతనం కోసం కాకుండా అణిచివేయబడ్డ అభ్యర్థులు పంచే నోట్ల కోసం ఎదురుచూసే దుస్థితికి దిగజారాం.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

డెమోక్రసీ ఇండెక్స్'లో భారత్‌కు 51వ స్థానం

10 స్థానాలు దిగజారి అప్రజాస్వామిక దేశాల జాబితాలోకి చేరింది. కారణం గతంలో లేనంతగా భారత్‌లో ప్రజాస్వామ్య విలువలు పతనమయ్యాయి. నిరసన ప్రదర్శనలపై కాల్పులు, లాఠీఛార్జీలు, పోలీసులు ఇంటి తలుపులు పగలగొట్టుకొని అరెస్టులు సర్వసాధారణం అయ్యింది. ప్రశ్నించేవారు కవులు కళాకారులు, మేధావులు, రచయితలు పట్టపగలు హత్యకు గురికావడం సాధారణం అయ్యింది. ప్రజల అభిప్రాయాలు సమాచారం స్వేచ్ఛగా పంచుకునే ఇంటర్నెట్ వందలసార్లు ఆపి వేశారు. అయినా ఈ దేశంలో స్వేచ్ఛ ఇంకా బతికే వుంది.



కాకపోతే అది ప్రజల స్వేచ్ఛని హరించే వారిచేతిలో ఉంది. దాన్ని ప్రజల చేతిలోకి తేవడం కోసం మరో ఉద్యమం ఉవ్వెత్తున జర గాలి. భారత్‌కు 2017 లో 42వ ర్యాంకు, 2018లో 41వ ర్యాంకు రాగా, ఈసారి 51వ ర్యాంకుకు పడిపో యింది. 2018లో భారత్ స్కోర్ 7.23 కాగా, ఈసారి అది 6,90కి దిగజారింది. కాశ్మీర్లో పెద్దఎత్తున కేంద్ర బలగాలను మోహరిం చటం, ఇంటర్నెట్ సేవల్ని స్తంభిం పజేసి పాలకులు పౌర హక్కుల్ని కాలరాశారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. అసోంలో ఎన్నార్సీ ప్రక్రియ వల్ల లక్షలాది మంది భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని నివేదికలో పేర్కొన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం ప్రజాస్వామ్య ప్రేమికులు స్వేచ్ఛ స్వాపనికులు మతాలు, ప్రాంతాలు, హద్దులు చెరిపి ఒక్కటై అడుగు ముందుకు వేయాలి.

మందా సైదులు
సామాజిక కార్యకర్త 9704874247

సెక్యులర్ రాజ్యాంగమే అవసరం

- మోడీ మళ్లీ అధికారంలోకొస్తే రాజ్యాంగ మార్పు తథ్యం
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రయివేటీకరణ వ్యతిరేకం
- ఓయూ, తెలంగాణ యూనివర్సిటీల డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొ.గాలి వినోద్ కుమార్



74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఓయూ, తెలంగాణ యూనివర్సిటీ డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ నవ తెలంగాణకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు.

నవతెలంగాణ-ఓయూ

నవతెలంగాణ : రిపబ్లిక్ డే అంటే ఏమిటి?

ప్రొ.గాలి వినోద్‌కుమార్ : ప్రజల చేత ప్రజల కోసం రాసుకున్న ప్రజా రాజ్యాంగం ఆమోదించింది 26 నవంబర్ 1949. అయితే అది అమల్లోకి వచ్చింది 26 జనవరి 1950. ఆ రోజును రిపబ్లిక్ డే పండుగగా ప్రతీ సంవత్సరం జరుపుకుంటున్నాం. రాజ్యాంగ మౌలిక లక్ష్యాల సాధన కోసం రాష్ట్రపతి నుంచి మొదలుకుంటే సామాన్య ప్రజల వరకు ప్రతీ ఒక్కరూ భారత రాజ్యాంగ నియమావళికి కట్టుబడి పని చేయాల్సిన బాధ్యతను గుర్తు చేయడమే రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని, రిపబ్లిక్ డే గా జరుపుకుంటారు.

నవతెలంగాణ :రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు అంటే ఏమిటి?

వినోద్‌కుమార్ :రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు అనగా భారతదేశం సార్వభౌమాధికారాన్ని, సామ్యవాదాన్ని, లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గణతంత్ర ప్రజా ప్రతినిత్యాన్ని పరిరక్షిస్తూ స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సమైక్యభారత దేశ నిర్మాణం అన్ని వర్గాలు అందరి ప్రజలకు సమాన అవకాశాలు, సమాన హెూదా జనాభా దామాషా పద్ధతిలో సంపద పంపిణీ లాంటి అనేక భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి ఈ దేశంలో ప్రధానమంత్రి నుంచి మొదలుకుంటే గ్రామ సర్పంచి వరకు రాష్ట్రపతి నుంచి మొదలుకుంటే గ్రామ కార్యదర్శుల వరకు ప్రపంచ కుబేరులు మొదలుకుంటే పేదవాడి వరకు ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు కట్టుబడి వాటి సాధన కోసం కృషి చేయడమే భారత రాజ్యాంగం కర్తవ్యం. ముఖ్యంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమతా భారతాన్ని నిర్మించాలని భావించారు. ఇవి భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యం.

నవతెలంగాణ :75 సంవత్సరాల స్వతంత్ర్య భారతంలో రాజ్యాంగ అమలు తీరు ఏ రకంగా ఉంది?

వినోద్‌కుమార్ :75 సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో 73 సంవత్సరాల స్వతంత్ర్య రాజ్యాంగ ఫలాలు కేవలం 15 శాతం ఉన్న అగ్రవర్ణ కులాలకు మాత్రమే దక్కాయి. ఒక శాతం జనాభా కలిగిన సంపన్న వర్గాలకు అలాగే 56శాతం జనాభా ఉన్నవారి సంపదను దేశంలో కానీ రాష్ట్రాల్లో గాని అగ్రవర్ణ కులాల పార్టీలకు ఈ దేశ సంపదను దోచిపెట్టడమే కాకుండా అధికారాన్ని పరిశ్రమల్ని కార్పొరేట్ విద్య వైద్యం ఇలా అన్ని రంగాల్లో వారిదే ఆధిపత్యం ఉంది. సంపన్నుడు మరింత సంపన్నుడు అవ్వడానికి.. పేదవాడు మరింత పేదవాడిగా మారడానికి కారణమైంది. దేశ జనాభాలో 85 శాతం ఉన్న బహుజనులకు సంపదలో గాని పరిశ్రమలో గాని అధికారంలో గాని కార్పొరేట్ రంగంలో గానీ ప్రయివేటు రంగంలో గానీ వారికి రావలసిన వాటా రాకపోవడమే కాకుండా ఈ వర్గాలు అన్యాయాలకు, అణచివేతకు, కులాదారిత, మతా దారిత హింసకు గురవుతూనే ఉన్నారు. మనువాద పాలకులు రాజ్యాంగానికి బదులు మను ధర్మాన్ని అమలు చేస్తూ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారు.

నవతెలంగాణ :మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని ప్రచారం జరుగుతున్నది ఇది వాస్తవమేనా?

వినోద్‌కుమార్ :ఆర్ఎస్ఎస్ 1925లో స్థాపించినప్పుడే భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మారుస్తాం అని ప్రకటించింది. అయితే హిందుత్వ శక్తులు ఇంత కాలం అధికారంలోకి రాకపోవడమే కాకుండా సంపూర్ణ మెజారిటీ సాధించలేదు. కానీ 2014 నుంచి 303 ఎంపీ స్థానాలు కలిగిన బీజేపీ సంపూర్ణ మెజార్టీ సాధించడమే కాకుండా వివిధ రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టి అటు రాజ్యసభలోనూ మెజార్టీని సాధించింది. అయితే రాజ్యాంగాన్ని మార్చాలంటే అటు లోక్‌సభలోను ఇటు రాజ్యసభలోను 2/3 మెజార్టీ రావాలి. అయితే 2023 సంవత్సరంలో 9 రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా 2024లో పార్లమెంటు ఎన్నికలు దేశవ్యాప్తంగా జరగనున్నాయి. ఎన్నికల్లో మెజార్టీ రాష్ట్రాల్లో గెలిచి, 400కు పైగా పార్లమెంటు స్థానాలను సాధించి సంపూర్ణ మెజార్టీ రెండు సభల్లోనూ సాధించి రాజ్యాంగాన్ని మార్చి హిందూ మతం పునాదిగా మను ధర్మం ఆధారంగా వర్ణ వ్యవస్థ పునరుద్ధరణ దిశగా ఈ దేశానికి అటు బ్రాహ్మణిజం ఇటు క్యాపిటలిజం ప్రమాదకరమని బోధించిన బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాలకు తూట్లు పొడిచే విధంగా చేయనున్నారు. ఈ రెండు సిద్ధాంతాలను అమలుపరిచే హిందూ రాష్ట్రం పేరుతో బ్రాహ్మణ ఆధిపత్య హైందవ అసమానతల పునాదిగా 2025 సంవత్సరానికి ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 ఏండ్లు అవుతున్న సందర్భంగా వారికి రాజ్యాంగాన్ని మార్చి బహుమతిగా ఇవ్వనున్నారు. ఇప్పటికే అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తి కావస్తున్నది. అలాగే ఇంద్రలోకం లాంటి పార్లమెంట్ భవనం పూర్తయింది. 2025 సంవత్సరం హిందూ రాష్ట్ర అవతరణ సంవత్సరంగా ఆర్ఎస్ఎస్ అఖండ భారత ఉత్సవాలు చేసుకోబోతున్నది.

నవతెలంగాణ :క్రైస్తవం, ఇస్లాం మతంలోకి మారిన దళితులు, ముస్లింలు, ఆదివాసీలు ఇతర మైనార్టీలకు బీజేపీ పాలనలో రక్షణ ఉందా ?

వినోద్‌కుమార్ :ఇస్లాం, క్రైస్తవ మతం విదేశీ మతాలని ఆ మతాల్లోకి వెళ్లిన దళిత క్రైస్తవ ముస్లింలకు రిజర్వేషన్‌లు వర్తించవని ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం స్పష్టంగా సుప్రీంకోర్టుకు లిఖితపూర్వక పత్రం దాఖలు చేసింది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఈ మతంలోకి మారిన వారిపై దాడులు, చర్చిలు కూలగొట్టడం, మసీదుల్లో మైకులు పీకేయడం, బైబిల్ పట్టుకుంటే హింసించడం, తన్నడం, బోధిస్తే చంపడం లాంటి అనేక క్రూర హింసలు మైనార్టీలపై జరుగుతున్నాయి.. వాస్తవంగా దళితులు, క్రైస్తవులు, ముస్లింలు, ఆదివాసీలు మైనార్టీలు కాదు. ఈ దేశ జనాభాలో సుమారు 40 నుంచి 45 శాతం ఉన్నారు. బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు, అగ్రవర్ణాలు, శూద్రులు దేశ జనాభాలో 15 శాతం కూడా లేరు. 52 శాతం ఉన్న బీసీలను హిందువులుగా 45 శాతం ఉన్న పై వర్గాలను కూడా హిందూ చట్రంలోకి బలవంతంగా తెచ్చి వారిని మెజార్టీ హిందువులుగా చూపిస్తున్నారు. వాస్తవానికి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు హైందవులు వారు హిందువులు కాదు. ఆర్యజాతి సంతతి. వాస్తవంగా ఈ దేశ మూలవాసులైన సింధు నాగరికత పునాది నుంచి పుట్టిన బహుజనులు లేదా ద్రావిడులు ఆది హిందువులు. మెజార్టీ ప్రజలను రాజ్యాంగం ద్వారా మైనార్టీలుగా గుర్తించి వారిపై మెజార్టీ పేరుతో మత హింసను నిరంతరం కొనసాగిస్తున్నారు. లౌకిక రాజ్యాంగం ఉన్నప్పుడే ఈ పరిస్థితి ఉంటే హిందు రాష్ట్రంగా భారత రాజ్యాంగం అవతరిస్తే ఈ మైనార్టీల పరిస్థితి మరింత దయనీయంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్, అమెరికా, యూరప్, చివరికి ముస్లిం దేశాలు సైతం భయపడుతున్నాయి. ఒకవేళ 2025లో అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా మెజారిటీ మతస్తులైన క్రైస్తవులు, ముస్లింలు ఒక్కటై భారతదేశంపై దండయాత్ర చేసే అవకాశం ఉంది. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే సెక్యులర్ రాజ్యాంగమే అవసరం. భారతదేశాన్ని 75 సంవత్సరాలుగా ఒక ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టాయి. అదే ఉత్తమమైన పద్ధతి, దానికి విరుద్ధంగా రాజ్యాంగాన్ని మారిస్తే దేశంలో అంతర్గత యుద్ధం మొదలయ్యే ప్రమాదం ఉంది.

నవతెలంగాణ :ప్రయివేటీకరణ రాజ్యాంగ సూత్రాలకు అనుకూలమా? లేక వ్యతిరేకమా?

వినోద్‌కుమార్ :1990 తర్వాత ఏర్పడిన ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ ఫలితంగా ఈరోజు ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టి ఆదానీ, అంబానీ, లాంటి పెట్టుబడిదారులు ప్రపంచ కుబేరులుగా ఎదగడానికి ప్రపంచీకరణ ఉపయోగపడింది తప్ప 80 శాతం రేషన్ కార్డుల మీద ఆధారపడి జీవించే పేదల బతుకుల్లో ప్రపంచీకరణ ఫలాలు ఏ మాత్రం మార్పులు తీసుకురాలేకపోయాయి. దాంతో పేదలు మరింత పేదలుగాను, ఎలాంటి రాజ్యాంగపరమైన హక్కులు లేని విగత జీవులుగా, కాయ కష్టం చేసి దానికి ఫలితాన్ని ఆశించని వ్యక్తులుగా నిలిచిపోయారు.

ఈ ప్రయివేటీకరణ ఒక శాతం జనాభా కోసం, కొన్ని కుటుంబాల ఆధిపత్యం కోసం, కొన్ని కులాల అధికారం కోసం ఉపయోగపడింది. ఈ ప్రయివేటీకరణకు బ్రాహ్మణిజం తోడై హిందుత్వం పేరు మీద హైందవత్వం, బ్రాహ్మణాధిపత్యం, వర్ణాధిపత్యం పెరిగి ప్రపంచీకరణకు తోడు అగ్రవర్ణాల దోపిడి మరింతగా పెరిగింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు, ఒకే దేశం, ఒకే భాష, ఒకే దేశం, ఒకే పార్టీ పరిపాలన లాంటి నియంతత్వ పెట్టుబడుదారితనాన్ని తీసుకొస్తున్నారు. ఈ ప్రపంచీకరణ కాస్త బ్రాహ్మణీకరణ పెట్టుబడిదారీ వ్యవస్థగా మారింది. అవి పూర్తిగా భారత రాజ్యాంగ విలువలకు విరోధకాళిస్తూ అన్ని రంగాల్లో అసమానతలను పెంచి పోషిస్తోంది.

స్వాతంత్ర్యం-గణతంత్రం మధ్య వ్యత్యాసం

నవతెలంగాణ-హయత్ నగర్



బ్రిటీష్ వారు వర్తక రూపంలో మన దేశానికి వచ్చి సుమారు 200 ఏండ్లు పాలించారు. వారి నుండి మన దేశ ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధించడానికి గాను సమర యోధులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి పోరాటాలు సాగించినందునే 1947లో మన దేశాన్ని బ్రిటిష్ వాళ్లు వదిలి వెళ్లారు. అందుకే ఆగస్టు 15న జరుపుకునేది స్వాతంత్ర్య దినోత్సవం. అదేవిధంగా పరాయి పాలనలో 200ఏండ్లు బతికిన తరువాత స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కూడా మన పరిపాలన బ్రిటీష్ రాజ్యాంగం ప్రకారం పాలన సాగేది. ఆ తరువాత మన దేశాన్ని మనమే పరిపాలించుకునేందుకు ఒక రాజ్యాంగం తయారు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. ఇతర దేశాలలో ఉన్న రాజ్యాంగ విధానాన్ని పరిశీలించిన పిదప సుమారు రెండు సంవత్సరాల 11నెలల, 18రోజుల స్వంత పరిపాలన వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా మన రాజ్యాంగాన్ని డాక్టర్ బీర్ అంబేద్కర్ రూపొందించి.. మన మొదటి రాష్ట్రపతి అయిన బాబు రాజేంద్రప్రసాద్ చేతికి అందజేశారు. 1950 జనవరి 26న భారత దేశం పూర్తిగా ప్రజా స్వాతంత్ర్యంగా రూపుదిద్దుకుంది. గణతంత్ర దినోత్సవం అంటే ప్రజలే ప్రభుత్వం, ప్రభుత్వమే ప్రజలు అని. మన దేశంలో ప్రతి ఏడాదికి రెండు సార్లు జాతీయ జెండా ఎగురవేసి, జాతీయ గీతాలపన చేస్తారు.

జాతీయ స్థాయిలో సాహస బాలలు, స్ఫూర్తి దాతలు, సాహసం, తెగువ, సమయ స్ఫూర్తి అన్నింటికీ మించి ఆపదలో ఉన్న వారిని కాపాడాలనే మానవతా దృక్పథం కలిగి ఉండాలి. జాతీయ సాహస బాలల సాహిత్య పురస్కారాన్ని ప్రవేశ పెట్టింది కేంద్ర ప్రభుత్వం. బాలలు దేశ వ్యాప్తంగా వారి కళ్లెదుట ఆపదలో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడే వారిని ఎంపిక చేసి వాటికి 26న సాహస బాలల అవార్డులు అందజేస్తారు.

లౌకికత్వం, లింగసమానత్వమే రాజ్యాంగ స్ఫూర్తి

భారత సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశం. 'భౌతిక ప్రపంచానికి చెందిన, ఆధ్యాత్మికంకాని, మతాతీతమైన' అని లౌకికత్వానికి అర్థాలు. మత స్వేచ్ఛ, హేతు, భౌతిక, మానవతావాదాల పట్ల సహనం, గౌరవం లౌకికమని ఆస్ట్రేలియా రాజ్యాంగ ఆచార్యుడు ఆంథొని రొలాండ్ బ్లాక్ షీల్డ్ నిర్వచించారు. "లౌకిక దేశం పౌరులకు మతస్వేచ్ఛనిస్తుంది. రాజ్యాంగబద్ధంగా దేశం ఏ మతానికీ చెందదు. మతంలో జోక్యం చేసుకోదు. మతాన్ని ప్రోత్సహించదు" అని అమెరికా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ రాజకీయ శాస్త్ర గౌరవ ఆచార్యుడు డొనాల్డ్ యూజీన్ స్మిత్ అన్నారు. "రాజ్యాంగంలో మనదని చెప్పుకోదగ్గ అంశమే లేదు. మనుస్మృతి ప్రపంచ సమ్మతి, ప్రశంసలను, యాదృచ్ఛిక విధేయతను, అనుగుణ్యతను పొందింది" అని సంఘ్ గురు మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ అమానవీయ అసమానత, అలౌకికత్వాలను పొగిడారు. రాజ్యాంగంలోని 1(1) భారత్ రాష్ట్రాల సమాఖ్య, 19(1) భావ ప్రకటనా స్వేచ్ఛ, 21 జీవన హక్కు, 25(1) మత స్వేచ్ఛ, 51(1)(హెచ్) శాస్త్రీయ దృక్పథం లాంటి అనేక అధికరణలను సంఘ్ ప్రభుత్వం ధిక్కరించింది. ప్రపంచీకరణ ప్రపంచాన్ని మతీకరించింది. మతాన్ని రాజకీయీకరించింది. రాజకీయాల్లో మతం దూరింది. మతోన్మాదులు ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణలను, హింసను ప్రేరేపిస్తున్నారు. అధికారంతో రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, సామాజికంగా బలపడిన సంఘీయులు హిందూయేతరులను, అవిశ్వాసులను, తమ తాత్వికతతో విభేదించేవారిని పాకిస్తాన్ పొమ్మన్నారు. సర్వమత ప్రజల సొమ్మును ఒక మత వేడుకలకు ఖర్చుపెట్టవచ్చా? నేటి పాలకులు చేస్తున్న ఈ పనులు రాజ్యాంగ విరుద్ధం. కాషాయ సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ బోధనలతో భారత విదేశీ శాఖ పుస్తకాన్ని ప్రచురించి విదేశాల్లో పంచి సంఘ్ భావజాలాన్ని ప్రచారం చేస్తోంది. ఈ ఖర్చు ప్రజల సొమ్మే. సంఘ్ సిద్ధాంత కర్త దీనానాథ్ బాత్రా రచించిన 'తేజోమయ భారత్' మొదలగు హిందుత్వ తాత్విక పుస్తకాల ముందుమాటల్లో, సభల్లో, సైన్సు కాంగ్రెస్‌లో ప్రధాని హైందవ పురాణ ఊహాగాథలను నిజాలుగా, విజ్ఞాన శాస్త్రాంశాలుగా వర్ణించారు. ప్రజల శాస్త్రీయ దక్పథాన్ని పెంచాలన్న రాజ్యాంగ అధికరణ 51(1)(హెచ్) ను తుంగలోతొక్కారు. '82% హిందువులున్న దేశాన్ని హిందుత్వంతో, భగవత్ భావజాలంతో మోదీ ఏలాలనుకుంటున్నారు. ఇతర మతాలను క్రమేపీ నాశనం చేయాలనుకుంటున్నారు' అని న్యాయమూర్తి పి.బి. సావంత్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ అధికరణ 14 ప్రకారం రాజ్యం ఏ వ్యక్తికీ చట్ట సమానత్వాన్ని తిరస్కరించరాదు, చట్టాలను సమానంగా పరిరక్షించాలి. అధికరణ 15 ప్రకారం ప్రజలు జాతి, మత, కుల, లింగ, జన్మ స్థలాల ఆధారంగా ఏ వివక్షకు గురికాకుండా రాజ్యం కాపాడాలి. అధికరణ 15(3) మహిళలకు, పిల్లలకు ప్రత్యేక నిబంధనల అవకాశం కల్పిస్తుంది. మైనారిటీ మతాల్లోనూ రాజ్యాంగ స్ఫూర్తితో స్త్రీ సమానత్వానికి తెరతీయాలి. ప్రార్థనాలయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. మన ఉన్నత వర్ణాల వనితలూ అంటరానివారే. "నిమ్న" జాతి మనుషుల్లాగా మ్లేచ్ఛులే. రాజ్యాంగ అధికరణలు 14, 15లకు అనుగుణంగా పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లకు చట్టం చేయాలి. నిబంధన 25 సిక్కు, జైన, బౌద్ధులను హిందువులుగా పేర్కొని, అపోహలు, అపార్థాలు, అనాచరణలకు దారితీసింది. లౌకికత్వాన్ని నీరుగార్చిందని మానవ హక్కుల కార్యకర్తల, రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. మతాంశాల జోలికి పోకుండా అవసరమైతే కేవలం ఆలయాల నిర్వహణ, పాలనాంశాలను ప్రభుత్వాలు చేపట్టవచ్చని అధికరణ 25 ప్రస్తావించింది. ఆ మేరకు దేవాదాయ శాఖలు, వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయబడ్డాయి. ఆలయాల నిర్వహణ, పాలనల్లో పాలుపంచుకోవటం దేవాదాయ శాఖ విధుల్లో భాగం కావచ్చు. కాని పాలకులు సతీసంతానాలతో దేవాలయాల కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దేవతలకు బట్టలిస్తున్నారు. 25వ అధికరణ రాజ్యాంగం హామీ ఇస్తున్న ప్రాథమిక హక్కులకు మూల స్తంభం. భిన్న సంస్కృతుల సంరక్షణా ప్రాముఖ్యతను, విభిన్న ప్రాంతాలలో శాంతియుత సహజీవన ఆలోచనను ప్రజలు, ప్రత్యేకించి పాలకులు, రాజకీయ నేతలు అర్థం చేసుకోవాలి. ఈ అధికరణ ఆలోచనా స్వేచ్ఛను, మతాచరణ హక్కును ఇచ్చింది. ప్రజాజీవితం, శాంతిభద్రతలు, నైతికత, ఆరోగ్యాలకు మతాచారాలు భంగం కల్గించరాదనీ చెప్పింది. బహిరంగ ప్రదేశాల్లో మతాచారాలు, పూజా కార్యక్రమాలు చేయరాదు. దేవాలయాలు, మసీదులలో జంతుబలులు, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదు. మత వేడుకల్లో, ప్రార్థనల్లో టపాసులు, మైకుల వినియోగ సమయాన్ని సుప్రీం కోర్టు కుదించింది. ప్రత్యక్ష మత సంబంధంలేని కార్యక్రమాలు, రాజకీయ, ఆర్థికాంశాలను క్రమబద్ధీకరించే చట్టాలు చేసే అధికారం రాజ్యానికున్నాయి. నేడు రోడ్లను దేవుళ్ల ఆక్రమించారు. 'భక్తులు' మతాచారాలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. శబ్ద, వాయు, జల, పర్యావరణ కాలుష్యాలను పెంచుతున్నారు. మతహత్యలకు పాల్పడుతున్నారు. వీటి నియంత్రణకు పాలక వర్గాలు తమ రాజ్యాంగ హక్కులను వాడుకోవు. నైతికక్షీణతతో, భయంతో, రాజకీయ లబ్ధినాశించి ఈ అరాచకాల జోలికి పోవు. పాలకులు, మతాచారులు, కార్పొరేట్లు కుమ్మక్కయ్యారు. సమాజాన్ని మతంతో విభజిస్తున్నారు. ఫలితంగా దైనందిన జీవితంలో మతం తిష్టవేసింది. మానవత్వం నశించింది. నేటి పరిస్థితుల్లో మతోన్మాద నియంత్రణ, లౌకికత్వ పునరుద్ధరణ అత్యవసరం. లౌకిక రాజ్యం మత మైనారిటీలకే కాదు మెజారిటీ మతస్తుల సంక్షేమానికీ అవసరం. మత కల్లోలాలు జరక్కుండా లౌకికభావాలను పెంపొందించాలి. మత ప్రమేయంలేని రాజకీయాలు అమలుకావాలి. వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోని మేరకే మత స్వేచ్ఛను అనుమతించాలి. సామాజిక వైఖరిని, దృక్పథాన్ని సకారాత్మకంగా మార్చాలి. బహుళ మతాల, సంస్కృతుల భారత సమాజంలో పాలకులు, నాయకులు, అధికారులు, ప్రజలు లౌకికత్వాన్ని రక్షించుకోవాలి. రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, 9490204545

స్వాతంత్ర్యం – గణతంత్రం



నవతెలంగాణ-వనస్థలిపురం

14.08.1947 అర్ధరాత్రి మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కానీ 15.08.1947 నే అధికారికంగా అమలులోకి వచ్చింది. ఆనాటి నుంచి 25.01.1950 వరకు ఆనాటి బ్రిటిష్ రాణి జార్జ్ ఎ క్మీ క్మీ వారి రాచరికపు పాలన కిందనే వుండి వారి ప్రతినిధి శ్రీచక్రవర్తుల రాజగోపాలాచారి చేతిలోనే అధికారం కేంద్రీకరించి వుంది. 26 జనవరి 1950 నాడు మన భారతదేశం సర్వ సత్తాక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది. దానినే మన రాజ్యాంగ సవరణ 42 ప్రకారం సామ్యవాద, లౌకిక రాజ్యంగా కూడా అదనపు మార్పులు చేశారు. అసలు ఈ రాజ్యాంగ ప్రక్రియ 1947వ సంవత్సరంలో ఒక ముసాయిదా తీర్మానం ద్వారా ఒక డ్రాఫ్ట్ కమిటీని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాయకత్వంలో ఏర్పాటు చేయబడింది. దాని సిఫార్సులను బట్టి 26 జనవరి 1950 నాడు అప్పటి వరకూ వున్న రాజ్యాంగ పరిషత్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

25.01.1950 నాడే కేంద్ర ఎన్నికల కమిషన్, 28.01.1950 నాడు భారతదేశ అత్యున్నత న్యాయస్థానం కూడా శ్రీ హెజె కన్నాను ప్రధానన్యాయ మూర్తిగా నియమించారు. స్వాతంత్రం వచ్చిన నాటినుంచి రాజ్యాంగం ఏర్పాటయ్యే వరకు పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా, రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది.

గణతంత్ర రాజ్యం

మన రాజ్యాంగం లిఖిత పూర్వకంగా ఏర్పాటు చేయబడినది. దీనిలో మూడు ప్రధాన భాగాలుగ రచించారు.

1.కార్య నిర్వాహక వ్యవస్థ

ప్రభుత్వం, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలి

2.శాసన వ్యవస్థ

పార్లమెంట్, రాష్ట్రపతి, రాజ్య సభ, ఉప రాష్ట్రపతి, లోక సభ, స్పీకర్

3.న్యాయ వ్యవస్థ

న్యాయ స్థానాలు, రాష్ట్రాలు, చట్ట సభలు, గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రి మండలి

4.పంచాయతీ రాజ్

5.ఎన్నికల వ్యవస్థ.

ఈ రాజ్యాంగంలో 48 అధికరణాలు, 12 షెడ్యూల్స్ ఏర్పాటు చేయబడిదంది. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగించేదిగా నిర్మాణం చేయబడింది. అదీగాక పటిష్ఠమైన పార్లమెంటరీ ప్రజా స్వామిక వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ కూడా కలిగేదిగా వున్నాయి.

26.01.1950 నుంచి వున్న ఎనిమిది షెడ్యూల్స్‌లో 1951లో 9వ షెడ్యూల్ 1వ సవరణ ద్వారా 1985 లో 10 వ షెడ్యూల్ 52వ సవరణ ద్వారా 1992 లో 11,12 షెడ్యూల్స్ 73, 74 సవరణల ద్వారా ప్రవేశ పెట్టారు. 74 సంవత్సరాల క్రితం నుంచి ఈ నాటివరకూ 105 సవరణలు పెట్టారు. కాకపోతే విశేషం ఏమిటంటే మనం మనదేశం సర్వ సంవృద్ధి కలిగి మేకిన్ ఇండియాగా అభివృద్ధి చెందాలనే సంకల్పం గల మన రాజ్యాంగంలో మాత్రం విదేశీ చట్టాల నుంచి ఈ విధమైన నిబంధనలు తీసుకొచ్చారు.

బ్రిటన్ నుంచి 3
అమెరికా నుంచి 3
ఇంగ్లాండ్ నుంచి 3
రష్యా నుండి 1
కెనడా నుంచి 1
జర్మనీ నుంచి 1

మన దేశ చరిత్రలో ప్రధానమైన విశేషాలు స్వాతంత్రం నుంచి నేటి వరకూ....

1948 జనవరి 31 మహాత్మాగాంధీ హత్య
1950 ఆగస్టు 15 అస్సాం, టిబెట్‌లో భూకంపం
1951 లో మొదటి పంచవర్ష ప్రణాళిక
1952 లో మొదటి లోక్‌సభ ఎన్నికలు
1953 ఎయిర్ ఇండియా జాతీయం
1954 లో పంచశీల ఒప్పందం
1955 లో భారతీయ స్టేట్ బ్యాంక్
1960 లో హరిత విప్లవం
1961 లో గోవా విముక్తి
1962 లో చైనా యుద్ధం
1963 మొదటి రాకెట్ ప్రయోగం
1965 లో పాకిస్తాన్‌తో యుద్ధం
1966 లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం, ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి
1969 లో ఇస్రో ప్రారంభం
1970 లో శ్వేత విప్లవం
1971 లో పాకిస్తాన్ యుద్ధం, బంగ్లాదేశ్ అవతరణ
1975 లో అత్యవసర పరిస్థితి
1982 లో మొదటి కలర్ టీవీ, ఆసియన్ గేమ్స్
1987లో గోవా రాష్ట్ర ఏర్పాటు
1988 లో సెబీ ఏర్పాటు
1989 లో అగ్ని క్షిపణి ప్రయోగం
1991 లో ఆర్థిక సంస్కరణలు
1995 లో మొదటి మెట్రో ఢిల్లీ
1998 లో ఫోక్రాన్ పరీక్షలు
1999 లో కార్గిల్ యుద్ధం
2000లో జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు
2001 లో ప్రథమ మహిళా రాష్ట్రపతి
2008 లో చంద్రయాన్
2010 లో నిర్బంధ విద్య ప్రాథమిక హక్కుగా పరిగణించడం
2015 లో నీతి అయోగ్ ఏర్పాటు
2017 లో జీఎస్‌టీ ప్రారంభం
2020 కోవిడ్ వైరస్
2022లో తొలి షెడ్యూల్ తెగకు చెందిన మహిళా రాష్ట్రపతి

వీటన్నిటిలో రాజకీయ పార్టీలకు సంబంధించిన సమాచారం పంపడం లేదు. వివాదాస్పదం కారాదనే భావనతో 1947 లో మన జనాభా 39 కోట్లు వుంటే 2023 నాటికి 141.46 కోట్లకు చేరింది.

దానికి తగినట్లుగా సంపద అభివృద్ధి చెందలేకపోయింది. ఈ విషయంలో ప్రతీవారూ తమ తమ కుటుంబాలను నియంత్రణ చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలి. వందేమాతరంతో మొదలైన మన దేశం నేడు వందే భారతంగా నిలబడి వుంది. రాజ్యాంగ సూచించిన విధంగా పటిష్ఠమైన కేంద్రం- రాష్ట్రాల మధ్య సమైక్యత ప్రధానం కావాలి. జాతి మత, వర్గ, వర్ణ, ధనిక - పేద భాషల విషయంలో పరస్పర సమతుల్యం పాటించాలి.


మహిళా సాధికారతకు మూలం రాజ్యాంగం

భారతదేశ చరిత్రలో గడిచిన కాలాన్ని చూస్తే స్త్రీ తనకు తెలియకుండానే బానిసగా జీవించింది. ఈ శాస్త్రాలు, వేదాల్లోని కొన్ని శ్లోకాలు స్త్రీ హక్కులను, వారి స్వేచ్ఛను అణగదొక్కి వారిని చాలా నీచంగా చూశాయి. మహిళలను సమాజానికి దూరం చేసి ఇంటికి మాత్రమే పరిమితం చేశాయి. కనీస అవసరాలు కూడా వారికి లేకుండా చేశాయి. వారికి సొంత ఆస్తి లేకుండా, విద్య ద్వారా పొందే కనీస జ్ఞానం సైతం వారికి అందకుండా చేశాయి.

విద్య వల్ల జ్ఞానాన్ని పొంది, సమాజంలోకి ప్రవేశించి అవగాహన పొందడం వల్ల మహిళల్లో ప్రశ్నించేతత్వం వస్తుంది. మగవారిని స్త్రీలు సమానత్వం కావాలని అడుగుతారు అనే ఉద్దేశంతో ఈ హిందూ శాస్త్రాలు, వేదాలు మహిళలకు వ్యతిరేకంగా రచించారు. ఆచార సాంప్రదాయాల పేరుతో శాస్త్రోక్తంగా వారిని నమ్మించారు. దీని వల్ల వారి స్వేచ్ఛను హరించి, సొంతంగా ఆలోచించే శక్తి లేకుండా చేశారు. స్త్రీని ఆటబొమ్మ వలె చూశారు. ఈ విధంగా పురుషాధిక్య సమాజాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొంత కాలం గడిచిన తర్వాత చాలా మంది స్త్రీ వాదులు, సంఘ సంస్కర్తలు, సమాజంలోని పెద్దలు, రాజకీయ నాయకులు స్త్రీల హక్కుల కోసం చాలా పోరాటాలు చేశారు. స్త్రీని పోత్సహిస్తూ కొన్ని గ్రంథాలు రాశారు. ఇలా స్త్రీ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమైన తర్వాత స్త్రీలలో కొంత మార్పు వచ్చింది. అయితే ఇందులో స్త్రీల గురించి పోరాటాలు, ఉద్యమాలు చేసిన వారిలో ఎక్కువ మంది పురుషులే ఉన్నారు.

నేటికి భారతదేశంలో చాలా చోట్ల పరిస్థితులు మారలేదు. పట్టణాల్లో పరిస్థితి ఒకలా ఉంటే గ్రామాల్లో మరీ దారుణమైన స్థితి ఉంది. మూఢ నమ్మకాల్లో కూరుకుపోయారు. ఈ పరిస్థితుల నుంచి స్త్రీలు మేల్కొని మారాలి. అయితే ఇదంత సులువైన విషయం కాదు. ఒక సవాలు వంటిది. మార్పు కేవలం రాజ్యాంగంతోనే సాధ్యం అవుతుంది. మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, సమాజంలో గౌరవం, ఆత్మవిశ్వాసం, ధైర్యం, సొంత ఆస్తి ఇలా అన్ని విధాలా అభివృద్ధి చెందాలి. దీని కోసం స్త్రీకి ఉన్న ఒకే ఒక్క ఆయుధం రాజ్యంగం మాత్రమే.

రాజ్యాంగం ద్వారా ఎలా సాధ్యపడుతుంది అనేది మనం చూస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14-16, 16(1),16(2)లో స్త్రీకి సాంఘిక, ఆర్థిక, సామాజిక, భావ స్వేచ్ఛ, సమానత్వంతోపాటు స్త్రీ అభివృద్ధికి తోడ్పడే ప్రత్యేకమైన చట్టాలు, హక్కులు, విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 33శాతం రిజర్వేషన్లు, వివిధ రకాలైన ప్రభుత్వసంక్షేమ పథకా లు ఇలా అనేక రకాలుగా స్త్రీల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో చట్టాలను రూపొందించారు. కాబట్టి దేశంలోని అన్ని ప్రాంతాల, అన్ని మతాల మహిళలు రాజ్యాంగ ప్రాధాన్యతను తెలుసుకోవాలి. మన దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏండ్లకు పైబడినా నేటికీ ఈ హిందూ శాస్త్రాలు, హిందూ గ్రంథాలు, వేదాల భావాజాల ప్రభావం చాలా ఎక్కువగా ఉంది.



ఆ భావాజాలం కేవలం ఊహజనితం. కాని దాన్నే నేటికీ బలంగా విశ్వసిస్తున్నారు. ప్రస్తుత వాస్తవ జీవన శైలిని అలవర్చుకోవాలి. హేతుబద్ధంగా విశ్లేషణ చేసుకోవాలి. మూఢనమ్మకాల ముసుగు వేసుకోని దేవుళ్ల పేరుతో నిత్యం పూజలు, హోమాలు, ఆచారాలు, సాంప్రదాయాల పేరుతో ఆలయాలను నిర్మించడం, వాటిపై వచ్చే ఆదా యంతో చాలా ధనాన్ని వృథా చేస్తున్నారు. ఈ ధనాన్ని ఆర్థికంగా వెనుకబడిన స్త్రీలకు గానీ, పేద విద్యార్థులకు గానీ, స్త్రీ సేవా సంస్థలకు గానీ వెచ్చిస్తే స్త్రీ అభ్యున్నతికి కృషి చేసిన వారవుతారు. అలాగే ఉన్నత చదువులు అభ్యసించే వారు డిగ్రీల కోసం కాకుండా సమాజం పట్ల వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. స్త్రీ అభ్యున్న తికి పరిశోధనా పద్ధతులను ప్రోత్సహించాలి. మహిళలు చదువుకుని తమ విజ్ఞానాన్ని హక్కులను కాపాడుకోవడానికి ఉపయోగించుకోవాలి. వారికి ఉన్న పరిమితుల నుంచి బయటపడాలి. అవగాహన లేని స్త్రీలకు, అణగారిన స్త్రీలకు, సమాజంలోని ప్రతి ఒక్క స్త్రీకీ తమ హక్కులపై అవగాహన కల్పించాలి. రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కులను వివరించాలి. దాని కోసం ముఖ్యంగా మహిళా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళా సంఘా లు, రాజకీయాల్లో ఉన్న మహిళా నాయకులు, సంక్షేమ సంఘాలు అందరూ కలిసి పని చేయాలి. రాజ్యాంగం పట్ల అవగాహనలేని స్త్రీల అభివృద్ధికి వాలంటీర్లుగా వ్యవహరించాలి.

కొత్త ఆలోచనల ద్వారా స్త్రీకి సంపూర్ణ సాధికారత సాధించగలం. ఇది నిజమైన మార్పునకు దోహదం చేసే అంశం. ఈ సమాజంలో హిందూ శాస్త్రాలు, రాజ్యాంగం ఈ రెండిటి అభివృద్ధి క్రమాన్ని పరిశీలన చేసుకుంటే మన అందరికీ తెలుసు హిందూ శాస్త్రాలు స్త్రీలోని శక్తిని అణగతొక్కి ముఖానికి ముసుగు వేసి, చేతికి చీపురును ఇచ్చి బానిసని, ఆట బొమ్మని చేసి ఇంట్లో ఓ మూలన కూర్చో బెట్టింది. నేటికీ కొన్ని ఆల యాలకు ప్రవేశం లేకుండా చేశాయి. అలానే మనుషుల మధ్య తేడాలను చూపి కులా లుగా విడగొట్టి సమాజాన్ని ముక్కలు చేసి మనుషుల మధ్య సంబంధాలు లేకుండా చేసి సమాజ విలువలను కోల్పోయేలా చేసింది. ఇక దళిత స్త్రీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. ఇలాంటి ఘనత ఈ హిందూ శాస్త్రాలదే. కానీ రాజ్యాంగం మాత్రం స్త్రీలను గౌరవించి సమాజంలో స్త్రీకి స్వేచ్ఛా జీవితం, సమానత్వం, విలువలతో కూడిన అధికారాలు, విద్య, ఉద్యోగాలు, ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించే విధంగా ఆత్మ విశ్వాసాన్ని నింపింది. చట్టసభలకు ప్రవేశించేలా చేసి దేశ అత్యున్నత సింహాసనం పై కూర్చోబెట్టి స్త్రీని గౌరవించింది కేవలం రాజ్యాంగమే. రాజ్యాంగం ప్రకారం అభివృద్ధిలో నిలిచిన వారిలో మొదటగా ఇందిరా గాంధీ గురించి చెప్పుకోవచ్చు. ఆమె మన దేశ తొలి మహిళ ప్రధాని. అలాగే నేటి తొలి గిరిజన మహిళా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము.

ఇలా ఎందరో రాజ్యాంగం వల్ల లబ్ధి పొందినవారు ఉన్నారు. ఇందులో కొంత మంది హిందూ సమాజాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగ గొప్ప తనాన్ని వివరించారు. దీనికి చక్కటి ఉదాహణ ఇందిరా గాంధీ. తొలి మహిళా ప్రధానిగా ఉన్న వారు కొన్ని బహిరంగ సభలలో రాజ్యాంగ గొప్పతనాన్ని వివరిస్తూ 'హిందూ సమాజం నన్ను ఒక మహిళగా చిన్న చూపు చూసింది. కానీ రాజ్యాంగం ద్వారా నాకున్న హక్కులు, అధికారాల వల్ల నేను ప్రధానిని కాగలిగాను' అని వివరించారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ హిందూ భావాజాల శాస్త్రాల వల్ల నేను చాలా అసమానతలకు గురయ్యాను. నా జీవిత లక్ష్యానికి అడ్డుపడింది హిందూ భావజాలం. చాలా చోట్ల అవమానాలు ఎదుర్కు న్నాను. కానీ రాజ్యాంగం నాకు ధైర్యాన్ని ఇచ్చింది. రాజ్యాంగ శక్తితో నేను ఈ స్థాయిలో ఉన్నాను' అన్నారు. 'మన దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కుమార్తె అయిన నాకే ఇలాంటి పరిస్థితి ఉంటే.. సామాన్య స్త్రీకి ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో నాకు తెలుసు' అంటూ దేశంలోని స్త్రీలను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రతి స్త్రీ తెలుసుకోవాలని వివరించారు.

- నలివెలుగు సునీల్ కుమార్, సెల్ : 9966616072

భారత స్వాతంత్ర్యోద్యమం.. గణతంత్ర చరిత్ర



నవతెలంగాణ-నాగోల్

భారత ఖండంల్లో స్వాతంత్ర్య సముపార్జనకై జరిగిన అనేక ఉద్యమాలను కలిపి భారత స్వాతంత్రోద్యమంగా పరిగణిస్తారు. ఎలాంటి హింసాత్మక మార్గంలో వెళ్లకుండా అహింసా పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్ర్యంలో భాగంగా చెప్పుకోవచ్చు. భారత ఉపఖండనలోని బ్రిటీష్, ఇతర రాచరిక పాలనను అంతమొందించడానికి పలు మార్గాలను అనుసరించి అనేక రాజకీయ పక్షాలు ఉద్యమాన్ని చేపట్టాయి. 16వ శతాబ్దంలో పోర్చుగీసు వారి ఆక్రమణలకు వ్యతిరేకంగా అబ్బక్క రాణి చేసిన పోరాటాలను, 17వ శతాబ్దం మధ్యలో బెంగాల్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా సాయుధ పోరాటాలను వలస పాలనకు వ్యతిరేకంగా వేసిన అడుగులను మొదటి అడుగులుగా చెప్పుకోవచ్చు. బెంగాలీలో

ప్రారంభమైన మొదటి సాయుధ పోరాటం తర్వాతి కాలంలో అది రాజకీయ పోరాటంగా పరిణామం చెంది భారత జాతీయ కాంగ్రెస్‌గా ఆవిర్భవించింది. 20వ శతాబ్దం మొదట్లో పోరాట పద్ధతుల్లో మౌలికమైన మార్పులొచ్చాయి. కాంగ్రెస్ అతివాదులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బీపిన్ చంద్రపాల్ విదేశీ వస్తువుల బహిష్కరణ, సమ్మె, స్వావలంభన వంటి పద్ధతుల ద్వారా పోరాటాలు నడిపారు. విప్లవ పోరాటాలు ప్రారంభమై మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీ, అమెరికాలో భారత స్వాతంత్ర్య సమరయోధులు ప్రారంభించిన గద్దర్ పార్టీ సహకారంతో జరిగిన సంఘటిత భారత సిపాయిల తిరుగుబాటు జాతీయ ఉద్యమంలో వచ్చిన మౌలిక మార్పుగా చెప్పుకోవచ్చు.

జాతీయ ఉద్యమ చివరి దశలో మహాత్మా గాంధీ నాయకత్వంలో జాతీయ కాంగ్రెస్ అహింసా మార్గంలో ఉద్యమించింది. సుభాష్ చంద్రబోస్ సాయుధ సంగ్రామం సరైనదిగా భావిస్తే స్వామీ సహజానంద సరస్వతి సన్నకారు రైతులు, శ్రామికులు, సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పిలుపు నిచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ఈ ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. నేతాజీ ఆజాద్ హిందూ ఫౌజ్ పేరుతో భారత సైన్యాన్ని స్థాపించి తూర్పు ఆసియా నుండి పోరాడగా, భారత జాతీయ కాంగ్రెస్ క్విట్ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఇలాంటి అనేక పోరాటాల ఫలితంగా అవిభక్త భారతదేశంలోని రాజ్యాలన్నీ కలిసి స్వతంత్ర్య దేశంగా అవతరించింది. 1947 ఆగస్టు 15న భారత్ స్వాతంత్ర్య దేశంగా ఆవిర్భవించినప్పటికీ 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. అప్పటినుండి భారత రాజ్యాంగం అమలులోకొచ్చి భారతదేశం సామ్యవాద, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. గణతంత్ర రాజ్యాంగా ఏర్పడి ఏడు దశాబ్దాలు గడిచిపోతున్నప్పటికీ దేశంలో పేదరికం ఇంకా కొట్టుమిట్టాడుతుందని చెప్పవచ్చు, నేటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది నిరుపేదలు ఆధునిక యుగంలో సరైన పని దొరకక కుల వృత్తులు సైతం తమ వృత్తిని కోల్పోయి పేదరికంలో మగ్గుతున్నారు. దేశంలో ప్రధానమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో ఇప్పటికీ పేదరికం కొనసాగుతూనే ఉంది.

అంగన్‌వాడీ విద్యార్థులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ-అంబర్‌పేట



అంగన్వాడీ విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్ పరిధిలోని గంగానగర్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ ఈ సందర్భంగా పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణులు, చిరు విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే బాబు, నర్సింగ్ యాదవ్, రాజు, అరవింద్, నర్సింగ్ యాదవ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లీకేజీపై దృష్టి సారించండి : కార్పొరేటర్

నవతెలంగాణ-అంబర్‌పేట



వాటర్ లీకేజ్ పై అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ అమృత సూచించారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక వెజిటేబుల్ మార్కెట్ గల్లీలోని వాటర్ లీకేజీ అవుతుందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటననీ, ఏమైనా సమస్యలుంటే ఉంటే నేరుగా తనని కలవాలని సూచించారు.

బిల్లుల వసూళ్లలో జలమండలి అధికారుల జాప్యం

- బిల్లులు చెల్లించిన వారిపైనా కొరడా..
- మొండి బకాయిదారులపై మెతక వైఖరి
- బిల్లులో తప్పులతడక

నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లి జలమండలి సెక్షన్ కార్యాలయం పరిధిలో ని పలు ప్రాంతాల్లో నల్లా బిల్లులు పేరుకుపోయి మొండి పద్దులుగా మారుతున్నాయి. జలమండలి అధికారులు బకాయిదారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సంస్థ ఆదాయానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. సెక్షన్ పరిధిలో రూ.3 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయంటే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రూ.20వేల నుంచి రూ.లక్షకు పైగా బకాయిలు ఉన్నప్పటికీ ఆ బిల్లులను వసూలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్న వారిపట్ల అధికారులు కనికరం చూపకుండా నిర్దాక్షిణంగా నల్లా కనెక్షన్ కట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. బాగ్ లింగంపల్లి సెక్షన్ పరిధిలో 5465 కనెక్షన్స్ ఉండగా సుమారు 3వేలకు పైగా వినియోదారులు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు.



బిల్లులు చెల్లించిన వారిపై కొరడా

చిక్కడపల్లికి చెందిన ఓ వినియోగదారుడి కనెక్షన్ డొమెస్టిక్ అయినప్పటికీ అధికారుల తప్పిదంతో దాన్ని కమర్షియల్ కనెక్షన్‌గా మార్చి అధిక బిల్లులు వేశారు. ఈ సమస్యను 2017లో అప్పటి జీఎం దష్టికి తీసుకెళ్లగా రూ.10వేలు బిల్లులు కట్టించుకుని డొమెస్టిక్ చేస్తామని చెప్పారు. ఇప్పటికీ ఐదేండ్లు గడుస్తున్నా కమర్షియల్ కనెక్షన్ నుంచి డొమెస్టిక్ కనెక్షన్‌కు మారలేదు. కొత్తగా వచ్చిన అధికారులు రూ.70వేలు బకాయిలు ఉన్నాయి చెల్లించాలని లేకుంటే కనెక్షన్ తొలగిస్తామని బెదిరించారు. మళ్లీ కొత్తగా వచ్చిన జీఎం దృష్టికి తీసుకెళ్లగా మారుస్తాం మళ్లీ రూ.10వేలు బిల్లు చెల్లించాలని చెప్పారు

సార్ వినియోగదారుడు రూ.10వేలు చెల్లించిన తర్వాత జీఎం మారారు. జీఎంలు మారుతున్నారు తప్ప కనెక్షన్ స్టేటస్ మాత్రం మారడం లేదని వినియోగదారుడు వాపోతున్నారు. చివరికి బిల్లు చెల్లించిన వ్యక్తి నల్లా కనెక్షన్ కోల్పోయాడు.

బిల్లులన్నీ తప్పులతడక

సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రతినెలా వచ్చే బిల్లులు తప్పుల తడకగా మారుతున్నాయి. రూ.వందల్లో రావాల్సిన బిల్లులు రూ.వేళల్లో వేస్తున్నారు. దీంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదేంటని అడగాడానికి వినియోగదారులు ఆఫీసుకు వెళ్లగా అధికారులు ఎవరూ అందుబాటులో ఉండటం లేదు.

ఏ సమస్య అయినా జీఎం దృష్టికే తీసుకెళ్లాలి
మేనేజర్ జీవనజ్యోతి

బాగ్ లింగంపల్లి సెక్షన్ పరిధిలో ఏ సమస్య ఎదురైనా సంబంధిత వినియోదారులు నారాయణగూడలోని జీఎం కార్యాలయానికి వెళ్లాలి.

దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు రాజ్యాంగ వ్యతిరేకం

- ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుద్ధిజీవులు ప్రజాస్వామ్యవాదుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ కోదండరాం లక్ష్మీనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలపై భారత ప్రభుత్వం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. జనవరి 11వ తేదీన దక్షిణ బస్తర్ లోని కిష్టారం, పామేడు ప్రాంతంలో జరిగిన సైనిక దాడికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ హెలికాప్టర్‌లో కోబ్రా జలాలు సీఆర్పీ బలగాలు జరిపిన బాంబుల దాడిలో పొట్టం హంగి అనే ఆదివాసి యువతీ మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. రాజ్యాంగంలోని జీవించే హక్కును కాపాడాల్సిన ప్రభుత్వం తానే ఈ దేశ ప్రజలపై వైమానిక యుద్ధం చేయడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. భారత ప్రజలు అనేక ప్రక్రియల ద్వారా పోరాటాల ద్వారా స్థాపించిన ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వాలే కాలరాస్తున్నయి అనడానికి ఈ ఘటన ఉదాహరణ అన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ త్రిపుర సంక్షోభంలో ఉన్నదని ఈ ఘటన తెలియజేస్తుందని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక సంస్కృతిక సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు వాటిని మరింత పెంచుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దండకారణ్య ఆదివాసులపై యుద్ధాన్ని ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో కేప ప్రభాకర్, ప్రముఖ కవి శివారెడ్డి, పాణి, ఎస్‌ప దేవిడ్, బల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. విషయం తెలిసి అతని పేరెంట్స్ పాకెట్ మనీ కట్ చేశారు. దీంతో ఏకంగా తండ్రి ప్రాణాలనే తీయాలనుకున్నాడు. అందుకు హత్య చేసేందుకు సిద్ధపడ్డాడు. 'ఓ యువతి డ్రగ్స్ కొనుగోలు కోసం చోరీకి పాల్పడింది. మొదట్లో ఇంట్లో తల్లిదండ్రుల పర్సులను మాయం చేసేది. అవి సరిపోకపోవడంతో బంధువుల ఇండ్లల్లో బంగారు ఆభరణాలను కొట్టేసి చివరకు పోలీసులకు చిక్కింది' 'మలక్‌పేటకు చెందిన ఓ యువకుడు డ్రగ్స్‌కు ఇంట్లో డబ్బులు ఇవ్వడం లేదని చెప్పి తల్లిదండ్రులు కొనిచ్చిన టూ వీలర్‌ను అమ్మడమే కాదు.. వీధుల్లో పార్క్ చేసిన వాహనాలనూ కొట్టేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. సరదాగా అలవాటైన డ్రగ్స్ వ్యసనంగా మారి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది. ఇటీవలె డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థుల ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. డ్రగ్స్ బారి నుంచి యువతరాన్ని కాపాడుకోవాలన్న మంచి ఉద్దేశంతో 'క్యాంపెయిన్ అగినెస్ట్ డ్రగ్స్' ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది ఖిల్వత్ సద్భావన ఫోరం. ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, ఖలీలుర్రహ్మాన్ ఈ మేరకు విద్యార్థుల్లో, యువకుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం హైదరాబాద్ షాలిబండలోని 'హయాత్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల పై ప్రముఖ లైఫ్ కోచ్ ఫక్రుద్దీన్ అలీ అవగాహన కల్పించారు. చేజేతులా యువతరం తమ జీవితాలను ఎలా కోల్పోతుందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కండ్లకు కట్టారు. డ్రగ్స్ బానిసత్వంలో నుంచి యువత బయటికి రావాలని కోరారు. యువతతో పాటు బానిసలు అవుతున్న ప్రజలు దాని ద్వారా వచ్చే ప్రభావాలను ఆరోగ్య సమస్యలను ప్రభావితం చేసే పల అంశాలను సూచించారు. ఈ కార్యక్రమంలో సద్భావన ఫోరం ప్యాట్రన్ యూసుఫ్ అలీఖాన్, పీఆర్ సెక్రెటరి మంజూర్ అహ్మద్, హయాత్ జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ ఇజ్లాల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-అడిక్‌మెట్

మహిళ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దయానంద్ నగర్, విద్యా నగర్ ప్రాంతానికి చెందిన అత్తాపురం అరుంధతి తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అరుంధతి మధ్యాహ్న సమయంలో తాగిన మైకంలో కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. సాయంత్రం వరకు ఆమె తిరిగి ఇంటికి రావచ్చని కుటుంబ సభ్యులు భావించారు. తన తల్లి ఇలా పలుమార్లు గతంలో తాగిన మైకంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజుల్లో తిరిగి వచ్చేదనీ, ఈ సారి 8 రోజులు గడిచినా ఇంతవరకు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కన వాళ్లను బంధువులను ఆరా తీసినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో స్థానిక నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీఫ్ సెక్రెటరీని కలిసిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారిని బుధవారం వారి కార్యాలయంలో మంత్రులు మహ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి క్యాలెండర్‌ను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బాల్ రాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.జగదీష్ నాయి, సెక్రటరీ సాగర్, బి.వెంకట్, గురు చరణ్, మల్లయ్య, పి.శ్రీనివాస్, తోకచుక్క నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 20శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి అని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పెళ్లి అంజి డిమాండ్ చేశారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలను తగ్గిస్తూ ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. తెలంగాణకు జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలనీ, ట్రిబుల్ ఐటీ ఐఏఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 6,7,8, తరగతులు ఇచ్చే స్కాలర్షిప్ లను ఇవ్వకుండా ఆపేసిందనీ, కేంద్రం రద్దు చేసుకుని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కేంద్రంలో ఉన్న 16 లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వన్ టైం ఛాన్స్ బ్యాక్ లాక్ ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలి

నవతెలంగాణ-ఓయూ



బ్యాక్ లాక్ ఎగ్జామ్ ఫీజులను తగ్గించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్టర్ ప్రో.లక్ష్మీనారాయణకు వినతిపత్రం బుధవారం అందజేశారు. 2010 నుండి 2017 సంవత్సరం వరకు అడ్మిషన్లు పొంది యూజీ, పీజీ, ఎంటెక్ కోర్సులలో బ్యాక్ లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్ టైం ఛాన్స్ పేరుతో 2022 నవంబర్ నెలలో స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం మేరకు ఎగ్జామ్ రాసుకుని అవకాశాన్ని విద్యార్థులకు కల్పించారు. కానీ స్టాండింగ్ కౌన్సిల్ చేసిన తీర్మానం యూనివర్సిటీ కోర్సుల ఫీజుల కన్నా ఎగ్జామ్ ఫీజును ఎక్కువగా నిర్ణయించింది. దీనిద్వారా విద్యార్థులు అంత ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన ఫీజులను తగ్గించి ఎగ్జామ్ రాసుకునే విధంగా ఫీజులు నిర్ణయించి విద్యార్థులకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య నెల్లి, ఉపాధ్యక్షుడు ఇరిగి బాలరాజు, అభ్యర్థులు శ్రవణ్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌పై 'భజరంగ్‌దళ్' దాడి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో టెన్షన్ నెలకొంది. తారక రమణ, ఐనాక్స్ థియేటర్‌ల వద్ద పఠాన్ సినిమాను నిలిపివేయాలంటూ భజరంగ్ దళ్ నాయకులు ఆందోళనకు దిగారు. వందల సంఖ్యలో వచ్చిన నాయకులు థియేటర్‌పై దాడి చేశారు. పటాన్ సినిమా పోస్టర్లను చించి వేసి సినిమా నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భజరంగ్ దళ్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగంలో ముగిసిన స్తుతి వర్క్‌షాప్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్ సంయుక్తంగా డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టి) సౌజన్యంతో ఈనెల 18వ తేదీన ప్రారంభమైన "సినర్జిటిక్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ యుటిలైజింగ్ ది సైంటిఫిక్ అండ్ టెక్నాలజీకల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (స్తుతి)-2023" బుధవారంతో ముగిసింది. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.బి.వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ ఎ.బాలకిషన్, గౌరవ అతిథులుగా నిట్ వరంగల్ మాజీ డీన్ ప్రొ.వేదుల రాజేశ్వర్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ, సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి) డైరెక్టర్ ప్రొ.డి.కరుణ సాగర్ హాజరై ప్రసంగించారు. "గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర క్షీణత, నీరు, గాలి, నేల కాలుష్యాల రోజు రోజుకీ పెరుగుతున్న ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పని చేయాలి" అన్నారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ కె. శైలజ, వృక్ష శాస్త్ర విభాగాధిపతి, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ ప్రొ.బి.రమాదేవి, నిట్ వరంగల్ టెక్నికల్ ఆఫీసర్ జి.ఎస్.ఆర్.సంజీవని మాట్లాడి వర్క్‌షాప్‌లో చూపించిన పరికరాలు, అధునాతన పరిశోధన యంత్రాల గురించి, వారం రోజులుగా విద్యార్థులకు ఏం నేర్పించారు, వర్క్‌షాప్ రిపోర్ట్‌ను వెల్లడించారు. అనంతరం వర్క్‌షాప్‌లో దేశంలోని వివిధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, ప్రవేటు సంస్థల నుంచి పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు ప్రొ. సబిత, డా.నాగేశ్వర్‌రావు, డా.విజయ్‌భాస్కర్, డా.కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అధ్యాపకులు డా.శశికళ, డా.మంచాల లింగస్వామి, కె.సజన్, భీమ్ రావు, పరిశోధకులు డా.గాజుల ప్రభాకర్, మహేష్, డా.సుమన్, డా.రఘు, రమేష్, కవిత, నీత, పీజీ విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ హైదరాబాద్ జిల్లా యూనిట్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులను ఉద్యోగులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కొత్త ఉద్యోగులు టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్), జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్‌ను బుధవారం గృహకల్ప కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించి సన్మానించారు. అనంతరం ముజీబ్ మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో విధులు నిర్వహించి సంఘానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా జిల్లా సంఘం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. నూతన సభ్యులకు ఎన్నికల అధికారి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్ సమక్షంలో ఎలక్షన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. యూనిట్ అధ్యక్షుడిగా సాయి కాంత్, సహ అధ్యక్షుడిగా రాజేశం, ఉపాధ్యక్షులుగా రాజేందర్ కుమార్, అనిత, వీణ కుమారి, కార్యదర్శిగా రాధ, సంయుక్త కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, జలజ, కుమారి భవాని, కోశాధికారిగా బాలరాజ్, కార్య నిర్వాహక కార్యదర్శిగా విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా రాజ్ కిరణ్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మిఎన్నికయ్యారు.



ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓటు మన హక్కు.. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే పాషా ఖాద్రీ అన్నారు. సంతోష్ నగర్ సర్కిల్ - 7 డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు నేతృత్వంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు రెయిన్‌బజార్‌లో నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు మన ఆయుధం అన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ అనుసంధానంతో ఓటర్ నమోదులో అవకతవకలను సరి చేసుకోవాలని సూచించారు. అనంతరం రెయిన్‌బజార్ కార్పొరేటర్ అబ్దుల్ వాసే, డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారుతో కలిసి సీనియర్, యువ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చెట్లను కొట్టేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డిమాండ్

నవతెలంగాణ-ముషీరాబాద్



ట్రీ కటింగ్ పేరుతో చెట్లను నరికివేస్తున్న అర్బన్ ఫారెస్ట్, విద్యుత్‌శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్" డిమాండ్ చేసింది. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో కౌన్సిల్ అధ్యక్షులు ఎస్.సిహెచ్. రంగయ్య, గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గుప్తా, ప్రకీతి ప్రేమికులు మన్నే దామోదర్ రెడ్డితో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రంగయ్య మాట్లాడుతూ ఓ పక్క సీఎం కేసీఆర్ హరితహారం పేరుతో కోట్లాది మొక్కలు నాటిస్తుంటే అధికారులు మాత్రం విద్యుత్ వైర్లకు అడ్డున్నాయన్న సాకుతో చెట్లను అడ్డంగా నరుకుతూ పచ్చదనాన్ని హరిస్తున్నారన్నారు. నగరంలో పలుచోట్ల కొన్ని వ్యాపార సంస్థలకు మేలు జరిగేలా ఫుట్ పాత్‌లపై ఉన్న భారీ వృక్షాలను కొట్టివేసేందుకు అర్బన్ ఫారెస్ట్ అధికారులే అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు క్షేత స్థాయి పరిశీలన చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. నానా రకాల కాలుష్యాలతో పర్యావరణం పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుంటే పచ్చదనాన్ని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అర్బన్ ఫారెస్ట్ అధికారులు, చెట్లు కొట్టిస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాపాడాల్సిన అధికారులే"వాల్టా చట్టం" నిబంధనలు బేఖాతరు చేయడం పట్ల విచారం వ్యక్తం చేశారు. చెట్ల పట్ల అర్బన్ ఫారెస్ట్, విద్యుత్ అధికారుల తీరు ఇలాగే కొనసాగితే " నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ " కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

నాలాల పునరుద్ధరణకు రూ.6,700 కోట్లు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-ధూల్‌పేట్

జీహెచ్‌ఎంసీ పరిధిలోని నాలాల పునరుద్ధరణకు రూ.6700 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇటీవల గోశామహల్ నియోజకవర్గం చక్నవాడిలో కుంగిపోయిన నాలా పునరుద్ధరణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నాలా నిర్మాణం కోసం రూ.1.27 కోట్లు కేటాయించమని తెలిపారు. బేగంబజార్, ఉస్మాన్ గంజ్ మీదుగా 2.5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ నాలా నాణ్యతా ప్రమాణాలను త్వరలో సమీక్షిస్తామని తెలిపారు. గోశామహల్ నియోజకవర్గంలో ఉన్న నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇతర అంశాలపై దృష్టి పెట్టడాన్ని మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోశామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు నంద కిషోర్ వ్యాస్ బిలాల్, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, రామచందర్ రాజు, సీనియర్ నాయకులు మహేందర్, ఆలె పురుషోత్తం, సంతోష్ గుప్త, ప్రియ గుప్త, లతక్కా, పరమేశ్వరి సింగ్, శిరజ్ సింగ్, శ్రీనివాస్ గౌడ్, క్రాంతి కుమార్, ధనరాజ్, ప్రకాష్ గుప్త, పప్పు భాయ్, ప్రదీప్, ప్రదీప్ కొలరి, సర్కిల్- 14 డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మంగలి షాపుల్లో కరెంటును నిలిపేయరాదు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్


విద్యుత్‌శాఖ అధికారులు మంగలి షాపుల్లో కరెంటు నిలిపివేయరాదనీ, రాష్ట్ర ప్రభుత్వం వారికి 250 యూనిట్ల సబ్సిడీ కరెంట్‌ను ఇస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రతినెలా 25వ తేదీ తర్వాత కరెంట్ అధికారులు మంగలి షాపులకు వచ్చి మీకు 250 యూనిట్ల సబ్సిడీ కరెంటు ఇవ్వట్లేదు.. మీరు కరెంటు బిల్లు చెల్లించాలని బెదిరిస్తున్నారు. కొన్ని చోట్ల షాపులో కరెంట్ కట్ చేసి వెళ్తున్నారు అని ముషీరాబాద్ నియోజకవర్గ నాయీ బ్రాహ్మణులు బుధవారం ఎమ్మెల్యే కోటర్స్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి ముషీరాబాద్ (ఏ డి ఈ) కరెంట్ అధికారికి ఫోన్ చేసి మీరు మంగలి షాపులలో కరెంటు ఎలా కట్ చేస్తారు అని ప్రశ్నించారు. వారికి 250 యూనిట్ల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తున్నదనీ, దానితో పాటు వారి షాపులలోకి వెళ్లి కరెంట్ కట్ చేయొద్దనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఉన్నదనీ, అది మీరు గమనించలేరా అని అధికారులతో మాట్లాడారు. కరెంట్ అధికారి స్పందిస్తూ ఇకనుంచి అలా జరగకుండా చూస్తామని హామీనిచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యదర్శి రాకేష్ చేర్యాల, మనోహర్ నాయి, విక్రమ్ అన్న, ప్రభువు, శివ, కిరణ్, శ్రీకాంత్, సరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద రోగులకు సహకారం అభినందనీయం

- ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్

నవతెలంగాణ-ధూల్‌పేట్

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి స్వచ్ఛందంగా సహకారం విజయ ట్రస్ట్ అందించడం అభినందనీయమని ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. బుధవారం కార్డియాక్ క్యాథ్‌లాబ్‌లో ఉపయోగించేందుకు వాడే పారేసే విలువైన వస్తువులను విజయ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శ్రీధర్ వీరా రెడ్డి వారి దాతల బృందంతో సూపరింటెండెంట్ కార్యాలయంలో విభాగం అధిపతి డాక్టర్ నిజాముద్దీన్ తో కలిసి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గుండెకు నిర్వహించే అధునాతన చికిత్సలకు ఎంత ఉపయోగపడతాయన్నారు. వారి దాతృత్వ కార్యకలాపాల ద్వారా పేద రోగులకు మరోసారి మద్దతునివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.



స్వచ్ఛందంగా సేవలు, ప్రభుత్వ సహకారంతో పేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు తమ వంతుగా అన్ని వేలలో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తమ ఉదాత్తమైన పనికి సంస్థకు అభినందనలు తెలిపారు.

మార్చ్ ఫాస్ట్‌లో మొదటి స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి అథ్లెట్‌లు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
మెదక్‌లో ఈనెల 21, 22న జరిగిన 9వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్‌లో సుమారు 150 మంది వివిధ వయస్సు గల అథ్లెట్స్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నుండి పాల్గొనగా, మెన్ అండ్ ఉమెన్ మార్చ్ ఫాస్ట్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి అథ్లెట్స్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ఆయన నివాసం వద్ద బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారిని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, సెక్రటరీ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి
ఆరోగ్యకర సమాజానికి ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి అన్నారు, జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో నేడు మహిళలు రాణిస్తున్నారని, నిరాశా, నిస్పృహలకు లోను కాకుండా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, సేవా, రాజకీయ రంగాలలో ఆడపిల్లలకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, పాఠశాలబాలికలు పాల్గొన్నారు.



చక్నవాడి నాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
గోషామహల్‌లోని చక్నవాడి నాలాను ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుం టామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివద్ధి, సినిమాటో గ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. చక్నవాడి నాలాపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి గత నెలలో కుంగిపోయింది. వెంటనే మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దష్టికి తీసుకెళ్లగా 1.27 కోట్ల రూపాయలను నూతన వంతెన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. ఇటీవలనే నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాగా, బుధవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నగరంలోని అనేక నాలాలు ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించబడ్డాయని, అవి శిథిలావస్థకు చేరుకొన్నాయని, వాటిని అబివృద్ధి చేసేందుకు మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చొరవతో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. చక్నవాడి నాలా దారుస్సలాం నుండి ప్రారంభమై తోఫ్ ఖానా, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, కిషన్ గంజ్, గురుద్వారా మీదుగా సుమారు 2.5 కిలోమీటర్ల దూరం ప్రవహించి మూసీనదిలో కలుస్తుందని చెప్పారు. ప్రజల అవసరాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. ఇష్టమొచ్చినట్లుగా నాలాలపై చేపట్టిన అక్రమ నిర్మాణాల వలన అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, ప్రజల్లో దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు ఉన్నాయని, ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిని తాము పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన బేగంబజార్ చేపల మార్కెట్‌ను 10 కోట్ల రూపాయల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. నూతన మార్కెట్‌లో అర్హత కలిగిన వారికి మాత్రమే స్టాల్స్‌ను కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జ్ఞాన్‌బాగ్ ప్రాంత ప్రజల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఈఎన్‌సీ జియాఉద్దిన్, సీఈ కిషన్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ నాయక్ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగుతో వృద్ధులకు అండగా సీఎం కేసీఆర్

- మంత్రి మల్లారెడ్డి
- డబిల్‌పూర్‌లో రూ.3 కోట్ల 18 లక్షలు, రైలాపూర్‌లో రూ.64లక్షల నిధుల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-మేడ్చల్
సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో పర్యటించి రూ.3కోట్ల 18లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం రైలాపూర్ గ్రామంలో రూ.64లక్షలతో సీసీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వృద్ధులకు పెద్ద కొడుకులాగా కంటి చికిత్సలు చేయిస్తూ ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్న వైద్యాధికారు లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతిరోజు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ ఏర్పాటుచేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షులు నంద రెడ్డి, ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయా నందారెడ్డి, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్,సర్పంచ్ లు గీత భాగ్యరెడ్డి, మెట్టు నర్మదా గోపాల్ రెడ్డి, లక్ష్మీ సంజీవయ్య, సొసైటీ చైర్మెన్ రణదీప్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు విజయా నందరెడ్డి, సర్పంచ్ లు ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు రాజ మల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నాయకులు భాగ్యరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటితరం యువత మంచిని స్వీకరించి, చెడును విసర్జించాలి

ఐఏఆర్ఈ కళాశాలలో సామాజిక స్పృహపై గరికపాటి ప్రసంగం



నవతెలంగాణ-దుండిగల్
నేటితరం యువత మంచిని స్వీకరించి, చెడును విసర్జించాలని ఒకరితో ఒకరు ఓర్పు, సహనం కలిగి మానవత్వంతో ఉండాలని పద్మశ్రీ డా.గరికపాటి నరసింహారావు తెలిపారు. బుధవారం దుండిగల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలకి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి సామాజిక స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్నటువంటి మంచి, చెడు విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ముఖ్యంగా తల్లిదండ్రులను, గురువులను, గౌరవించాల న్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, వీలైనంత వరకు ఎదుటి వారికి, తోటి విద్యార్థులకు సహాయపడేలా ఉండాలన్నారు. అవగాహనలేని విషయాలను, అధ్యాపకులతో తల్లిదండ్రులతో సంప్రదించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. తోటి వారితో అందరూ సమానమే అని, సామాజిక స్పృహ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆయనకి గణపతి ప్రతిమ, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సిహెచ్. సత్తిరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎల్‌వి. నరసింహ ప్రసాద్, అధ్యాపకురాలు శిరీష, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసన

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కుకాట్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండితులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పదోన్నతులు, షెడ్యూల్ విడుదల, ఆషెడ్యూల్లో భాషా పండితుల అప్‌గ్రేడ్ అయినటువంటి పోస్టుల్లో భాషా పండితులను పదోన్నతులు ద్వారా అవకాశం కల్పించేందుకు గాను 2017 తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి భాషా పండితులకు సంబంధించిన సమస్యలను త్వరలో పూర్తిచేస్తామని ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని, పండిత ఐక్య కార్యాచరణ వేదిక దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించుటకు పిలుపునిచ్చిన సందర్భంగా, ఒకరోజు భాషాపండితులందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేయాలనే పిలుపుమేరకు కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి జిల్లా అధ్యక్షులు విఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ, గత 20ఏళ్లుగా ఉద్యోగం పొంది పదోన్నతులకు నోచుకోకుండా ఉన్నత పాఠశాలలో వెట్టిచాకిరి నిర్వహిస్తున్న పండితుల ఆకాంక్షను, ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే దిశగా పత్రికలు కూడా సహకారం అందించాలని కోరారు. భాషా పండితుల, పీఈటీల పదోన్నతుల ఆకాంక్ష నెరవేరాలని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలు విజయవంతం చేసినందుకు భాషా పండితులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు దశలవారి కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకొని మన ఆకాంక్షను నెరవేర్చే విధంగా కృషి చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బి.స్వప్న, జిల్లా సమన్వయ సహఅధ్యక్షులు కృష్ణ గౌడ్, రామచందర్ ఎల్లమ్మ బండ, సీనియర్ భాషా పండితులు చంద్రశేఖర్ మాణిక్యం, జిల్లా మహిళా కార్యదర్శి సాయి గీతిక, నిరసనకు సంఘీభావం తెలుపుతూ భాషా పండితులు ఆకాంక్ష నెరవేరాలని ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు దమయంతి, రాణి, ఉమావసుంధర, విజయలక్ష్మి, మంజుల, మల్లారెడ్డి, నజీముద్దీన్, శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి తుల్జారాం, సహదేవ్‌లు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి

బాలానగర్ అధికారులకు పురస్కారాలు
దక్కడం హర్షణీయం - సీఐ కె. భాస్కర్



నవతెలంగాణ-బాలానగర్
రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు అధికారులకు అత్యుత్తమ పురస్కారాలు దక్కాయి. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన ముగ్గురు పోలీసు అధికారులకు నేడు సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా సేవా పథకాలను అందజేయనున్నారు.
బుధవారం కమిషనరేట్ నుండి సమాచారం అందుకున్న బాలానగర్ సీఐ భాస్కర్ వారిని అభినందించారు. పోలీసు శాఖలో అత్యుత్తమ సేవలందించిన పోలీస్ సిబ్బందికి సేవా పతకాలు, ఉత్కృష్ట, అతి ఉత్తిష్ఠ సేవా పథకాలను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అందజేయడం అభినంద నీయమని అన్నారు. పోలీసు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మక్బూల్ పాషా, ఏఎస్ఐ (క్రైం) సంగమేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లకు వివిధ సేవా పతకాలు బాలానగర్ పోలీసు అధికారులకు దక్కడం గర్వంగా ఉందన్నారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపే ఈ పథకాలని అన్నారు. భవిష్యత్తులో ఇదేవిధంగా సిబ్బంది ఉత్తమ సేవలందించి మరిన్ని అత్యుత్తమ పురస్కారాలను సాధించాలని సీఐ భాస్కర్ ఆకాంక్షించారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ స్కూల్‌లో 'పరీక్ష పే చర్చ'

- ఆర్ట్ కాంపిటీషన్‌తో సహా వివిధ పోటీల నిర్వహణ



నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా, దేశ వ్యాప్తంగా రూపొందించిన, పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా, డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్‌లు నిర్వహించిన, పాఠశాల కరెస్పాండెంట్ సురభి రవీందర్‌రావు, డైరెక్టర్ చెన్నమనేని స్రవంతి, తేజస్వినిరావు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గజ్జెల యోగానంద్, రవికుమార్ యాదవ్, కొరదల నరేష్, మొవ్వ సత్యనారయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రధాన మంత్రీ ఇప్పటి వరకు విద్యార్థులు రాసే పరీక్షల గురించి, పరీక్షల సమయంలో విద్యార్థులు గురయ్యే ఒత్తిడి గురించి ఆలోచించలేదని, అది కేవలం ప్రధాని నరేంద్ర మోడీకి మాత్రమే సాధ్యమైందని తెలుపుతూ, పరీక్ష పే చర్చ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులు పరీక్షలు రాసే ముందు, పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవకుండా, చదువుపై మక్కువ పెంచుకొని పరీక్షలు రాసి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. విద్యార్థులు పాఠశాల విద్యా దశ నుండే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, ఆ లక్ష్య సాధన కోసం, అంకితభావంతో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, మనిభుషన్, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధన హైస్కూల్‌లో ఆర్ట్ కాంపిటీషన్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం డివిజన్‌లోని మార్కండేయనగర్‌లో ఉన్న సాధన హైస్కూల్లో ప్రధాన మంత్రి 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థుల 'పెయింటింగ్ కాంపిటీషన్' నిర్వహించగా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ హాజరై గెలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సృజన, ఉత్సాహం, చూశాక పరీక్షలను వాటి ఒత్తిడిని తప్పకుండా జయిస్తారని నమ్మకం కలిగిందన్నారు. ఈనెల 27న ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి 'పరీక్ష పే చర్చ' ప్రత్యేక ప్రసారం ద్వారా విద్యార్థులు వారి తల్లిదండ్రులు వీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్ రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, బావిగడ్డ రవి, ఎక్సమ్ వారియర్స్ నిర్వహణ కమిటీ సభ్యులు దయాకర్, డివిజన్ అధ్యక్షులు దుర్యోధన్ రావ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరాం రెడ్డి, దీపక్ , కేశవ్, సందీప్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హోంగార్డుపైకి దూసుకొచ్చిన కంటైనర్ లారీ

అక్కడికక్కడే మృతి



నవతెలంగాణ- మేడ్చల్
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ హోంగార్డు పైకి కంటైనర్ లారీ దూసుకెళ్లి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్(35) బుధవారం ఉదయం 12 గంటల ప్రాంతంలో కండ్లకోయ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వేగంగా కంటైనర్ లారీ హోంగార్డు పైకి దూసుకురవడంతో శ్రీనివాస్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగ సంఘటన స్థలాన్ని ఏసీపీ రామలింగరాజు,సీఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

సోఫీఖాజా పాష దర్గాను దర్శించుకున్న నూతన్‌కల్ ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ- మేడ్చల్
మండల పరిధిలోని నూతన్ కల్ గ్రామంలో ఉన్న సోఫీఖాజా పాష దర్గాను పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి,వార్డు సభ్యుడు యూనిస్ పాషా బుధవారం దర్శించుకొని సోఫీ ఎండి హుస్సేన్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మల్లమ్మ,ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,నాయకులు జీవన్,మహేందర్ రెడ్డి,నారమ్ రెడ్డి,ఆంజనేయులు,కిష్టయ్య, మదన లక్ష్మీనారాయణ,సత్తి నరసింహారెడ్డి, యాదగిరి, అశోకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ మహాసభ సభ్యులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కే.వివేకానంద్‌ని పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మల స్వామి ముదిరాజ్, వాసుదేవరావు ముదిరాజ్, గొల్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, బొక్క శీను ముదిరాజ్, కనకయ్య ముదిరాజ్, గొడుగు శీను ముదిరాజ్ ,బల్ల సత్తయ్య ముదిరాజ్, వీరయ్య ముదిరాజ్, నరహరి ముదిరాజ్, నాగభూషణ్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, శ్రావణ్‌కుమార్ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ ,ప్రకాష్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్ తదితర ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి మారుపేరుగా నిలుస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో రూ.42 లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్డు నిర్మాణాల కొరకు స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తుందని, ఎక్కడ కూడా ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణాలు, రోడ్లు నూతన డ్రైనేజ్ వ్యవస్థలు, పార్కులు, ఓపెన్ వ్యాయామశాలలు, కమ్యూనిటీ హాల్స్, అనేకమంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇలా చెప్పుకుంటూ పోతే వేలకోట్ల రూపాయల అభివృద్ధి సంక్షేమం నియోజకవర్గంలో చేశామని ఆయన తెలిపారు.
జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, ఎక్కడైనా ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

మూసాపేట్ డివిజన్ బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, నారాయణపేట జిల్లా ఇన్‌ఛార్జి మాధవరం కాంతారావు, మూసాపేట్ కార్పొరేటర్ కె.మహేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ పరిధిలోని బూత్, బూత్‌కి భారతీయ జనతా పార్టీ కార్యక్రమంలో భాగంగా, నేడు స్థానిక బీజేపీ నేతలతో కలిసి పర్యటించారు. డివిజన్ వ్యాప్తంగా డివిజన్‌లో ఉన్న బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియ, బోగస్ ఓట్ల గుర్తింపుపై ఆరా తీశారు. ప్రతి బూత్ లో అధ్యక్షుడి ఇంటికి బోర్డు ఎర్పాటు చేసి వారిని సన్మానించారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు కార్యకర్తలు నాయకులు అందరూ సిద్ధంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం తోపాటు జిల్లా వ్యాప్తంగా బీజేపీ జెండా ఎగిరే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా అధ్యక్షులు శ్రీ హరీష్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, డివిజన్ ఇన్చార్జిలు వినోద్ కుమార్, శైలేష్ కుమార్, జిల్లా నాయకులు డాకయ్య, కృష్ణ ముదిరాజు, మల్లేష్, మాణిక్, యాదగిరి, మంగమ్మ, సతీష్, సాయి, శ్రీను, కిషోర్, అబ్బాస్, రవి గౌడ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

డయాలసిస్ స్థలాన్ని పరిశీలించిన వైస్ చైర్మెన్ మాధవరెడ్డి

నవతెలంగాణ ఘట్కేసర్



ఘట్కేసర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వం ఆస్పత్రిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న కిడ్నీ రోగుల డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బేతాళ నర్సింగ్‌రావు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యురాలు అబ్బగోని మీనాగౌడ్ కీసరగుట్ట ట్రస్టు బోర్డ్ కమిటీ సభ్యుడు మెరుగు నరేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బర్ల హరిశంకర్ ముదిరాజ్, పల్లె విజయ్‌గౌడ్, ఎండి సిరాజ్, కందకట్ల మాధవరెడ్డి, బానుక నవీన్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కొట్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు నియామకాల్లో అవకతవకలను సవరించాలి

నవతెలంగాణ - హస్తినాపురం



పోలీస్ నియమకాల్లో అవకతవకలను వెంటనే తొలగించి అర్హులైన వారికి పోలీస్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎల్.బి.నగర్ యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బి.యన్.రెడ్డి నగర్ చౌరస్తాలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షుడు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పు ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులందరినీ మెయిన్స్ పరీక్షకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కె.శివ కుమార్, వెంకటేష్, రుత్విక్‌రెడ్డి, శివ, గుణ, స్వామి, చిన్న గౌడ్, ఓం ప్రకాష్, చింటూ, విష్ణు, సాయి కృష్ణ, సందీప్, శశి, కార్తీక్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలను తొలగించిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్



అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం. 283లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను బుధవారం తెల్లవారుజామున జేసీబీల సహకారంతో రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య తొలగించారు. అనంతరం సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేదలు నాలుగు నెలల కింద గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, రెవెన్యూ అధికారులు పోలీసుల నిర్బంధంలో గుడిసెలను తొలగించడం దారుణమన్నారు. ఎలాంటి ఆధారాలు ఉండకూడదనే ఉద్దేశంతో ముందస్తుగానే తమ సెల్‌ఫోన్లు పోలీసులు లాగేసుకున్నారన్నారు. సర్వేనెం. 283/44/45లో కోర్టు ఆర్డర్ ఉందంటూ కొంతమంది కాంపౌండ్ వాలు నిర్మించుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్నా, రెవెన్యూ అధికారులు కోర్టు ఆర్డర్‌ను ఎత్తివేయడానికి ప్రయత్నం చేయకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారుల ద్వంద్వ వైఖరిని వీడాలన్నారు. ఎన్నిసార్లు గుడిసెలు పీకేసినా మళ్లీ గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నర్సింహ్మ, నాయకులు గుండె శివకుమార్, గుడిసెవాసులు సురేష్, ప్రణయ్, కిరణ్, మైసయ్య, యాదయ్య, నాగరాజు, మహిళలు పారిజాత, రాణి, ప్రభావతి, విజయ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు : తహశీల్దార్ అనితారెడ్డి

ప్రభుత్వం భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అనితారెడ్డి హెచ్చరించారు. అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెం 283 లో కొందరు అక్రమంగా నిర్మాణాలను, గుడిసెలను వేయడంతో వాటిని తొలగించామని తెలిపారు.

దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

గుడిసె వాసులకు సీపీఐ నాయకుల విజ్ఞప్తి



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని పాపాయిగూడ భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తామని, డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న దళారుల పట్ల గుడిసె వాసులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా వసూళ్లకు పాల్పడితే సీపీఐ నాయకులకు లేక స్థానిక పోలీసులకు ఆధారాలతో సహా సమాచారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు గుడిసె వాసులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలో గల పాపాయిగూడ సర్వే నెం. 215 నుండి 224లోని భూదాన్ భూముల్లో నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను ఇప్పించాలనే దృఢ సంకల్పంతో సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేశామన్నారు. భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, అతని అనుచరులు పాత తేదీల్లో పట్టాలు ఇచ్చినట్లుగా నకిలీ ప్రొసీడింగ్ పత్రాలను సృష్టించి అక్రమ మార్గంలో అమాయక ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయలకు భూములను విక్రయించి భూదందా చేస్తున్నారని వారు ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాటంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలను లక్ష్యంగా చేసుకొని ప్రతి గుడిసె వద్దకు వెళ్లి ఈ స్థలానికి సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను తాము ఇస్తామని అందుకుగాను తమకు వేల రూపాయల్లో డబ్బులు ఇవ్వాలని మభ్యపెడుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయం పట్ల గుడిసెవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ వసూళ్లను సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని, సుమారు రెండు దశాబ్దాలుగా భూదాన్ భూములకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, అంతకు ముందు యాభై సంవత్సరాల క్రితం నుండి ప్రభుత్వ రికార్డుల్లో సైతం భూధాన్ భూమిగా నమోదు చేయబడి ఉందన్నారు. ఈ భూదాన్ భూముల్లో తప్పుడు ఓఆర్‌సీ సంపాదించుకొని బోగస్ ప్రొసీడింగ్ పత్రాలు సృష్టించి అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. భూదాన్ భూములు నిరుపేద ఇళ్ల స్థలాలకు కేటాయించే వరకు పేద ప్రజలకు అండగా ఉంటామని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పేదలకు సీఎం సహాయ నిధితో ఎంతో మేలు

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవ తెలంగాణ- సరూర్ నగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో మేలు చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కి చెందిన ఎండి గౌస్ అనే వ్యక్తి కాళ్ల నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ డబ్బులకు ఇబ్బంది పడి స్థానిక నాయకులను సంప్రదించగా నిమ్స్‌లో చికిత్స కోసం మంత్రి సబితాఇంద్రారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లక్ష రూపాయలు ముందస్తు చెక్కు మంత్రి చేతులమీదుగా జిల్లెలగూడ క్యాంపు ఆఫీస్‌లో ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు ఎంఏ సాజీద్, రామిడి రాంరెడ్డి, కామేష్ రెడ్డి, బాలరాజ్, పవన్ యాదవ్, జంగయ్య యాదవ్, సాయినాథ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవ తెలంగాణ-సంతోష్ నగర్

దేశం, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలుచోట్ల కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న క్షౌరశాలలకు, లాండ్రీలకు, దోబీఘాట్లకు ఉచిత విద్యుత్ అందిస్తామని, గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని అమలు చేసేందుకు అధికారికంగా జీవో జారీ చేయడం పట్ల బీసీ వర్గానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా నాయిబ్రాహ్మణులకు, రజక వర్గానికి చెందిన వారికి నెలకు 250యూనిట్లు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు జీవోను జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎంఐఎం ఆక్టివ్ సభ్యులు, అధ్యక్షులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హోళ్లకు మరమ్మతులు

మొదలు పెట్టి మర్చిపోయారు?





నవ తెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ మజీద్ సమీపంలోని ముస్లిం సోదరులు నమాజ్‌కి వచ్చే వేళల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి అధికారులు మ్యాన్ హోళ్లకు మరమ్మతు పనులు మొదలు పెట్టి ఆ తర్వాత పూర్తి చేయకుడా మర్చిపోయారు. దీంతో ఇక్కడి వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఏ పని కూడా సరిగ్గా చేయడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నెలనెలా జీతాలు తీసుకుంటున్నా స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అనేకమంది ప్రాణత్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్లో గురుకుల కళాశాలలో జరిగిన జన జన మన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షులు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, సీఐ అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మన దేశ స్వతంత్ర్యం కోసం లక్షల మంది ప్రాణాలు అర్పించారన్నారు. భారత రాజ్యాంగం నిర్మాణం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.. తన కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా తన ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మన రాజ్యాంగాన్ని నిర్మించారన్నారు. రాజ్యాంగం ఏర్పాటు చేసి దాదాపు 74 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మన భారతదేశం జనాభాలో యువత ఎక్కువగా ఉన్నారన్నారు. కానీ యువత చెడు అలవాట్లకు ధూమ పానాలకు అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. స్వామి వివేకానంద లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని, స్వామి వివేకానంద 39 సంవత్సరాలు బతికి ఈరోజు దేశ యువతకే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అలా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్ కృష్ణ, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవ తెలంగాణ-ఉప్పల్

చిలకానగర్ డివిజన్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీతారామ కాలనీ ఎన్జీఆర్ఐ కాంపౌండ్ వాల్ నుండి రాఘవేంద్రనగర్ కాలనీ వినాయక టెంపుల్ వరకు నిర్మించిన స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్ పైన నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, రామానుజన్, అల్లిబిలీ మహేందర్, బింగి శ్రీనివాస్, బాణాల నారాయణరెడ్డి, రమేష్, ఫొటో బాలు, గూడూరు రమేష్, బాలు మహిళా నాయకులు షహనాజ్, సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపించాలి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు



నవ తెలంగాణ- సరూర్ నగర్

ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి చూపించాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ భాష్యం హైస్కూల్ విద్యార్థుల క్రీడా ఉత్సవాల ఫెస్టివల్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఇన్స్పెక్టర్ నాగమల్లు, జోనల్ ఇంచార్జ్ అంకమ్మరావు హాజరై క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల దశలోని క్రీడల్లో ఆసక్తి చూపించాలన్నారు. క్రీడలతో శారీరక శ్రమతోపాటు మానసిక ఉత్తేజం కలుగుతుందన్నారు. క్రీడలతో మంచి గుర్తింపుతోపాటు రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం వస్తుందన్నారు. సమాజంలో మంచి గుర్తింపు కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటిలో డ్రయినేజీ నీళ్లు కలవకుండా చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి



నవ తెలంగాణ- సరూర్ నగర్

ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తీలో తాగే నీటిలో డ్రయినేజీ వాటర్ కలిసి కలుషితమైన నీళ్ళు వస్తున్నాయని, స్థానిక ప్రజల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి వెంటనే బస్తీకి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక బస్తీ ప్రజల చేత సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేయించారు. ఆ అధికారి కూడా సానుకూలంగా స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్, పగడాల శ్రీశైలం, విజయ్, జహంగీర్, జగదీష్, నగేష్, బస్తీవాసులు భాస్కర్ నాయక్, ప్రేమ్ నాయక్, హరి నాయక్, దశరథ నాయక్, రవి నాయక్, బాలు నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

సర్పంచుల హక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి విమర్శించారు. బుధవారం తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల సమస్యలపై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతి చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటి, ఆఫీస్, ఉద్యోగం పనుల్లో బిజీగా ఉంటున్న మహిళలకు కాస్త మానసిక ఉల్లాసం ఉండేందుకు ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. పోటీల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ పంతంగి మాధవి, సంఘం అధ్యక్షుడు యాదగిరిరావు, కార్యదర్శి రమేష్, సాంస్కృతిక కార్యదర్శి సుభాషిణి, ప్రచార కార్యదర్శి రఘు వంశి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

కార్పొరేటర్ ఎండి సైపుద్దీన్ షఫీ



నవ తెలంగాణ-సంతోష్ నగర్

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఓల్డ్ మలక్ పేట డివిజన్ కార్పొరేటర్ ఎండి సైపుద్దీన్ షఫీ తెలిపారు. డివిజన్‌లో చేపట్టిన యూజీడీ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల్లో అధికారులతో సర్వే చేయించి అవసరమైన చోట్ల కొత్తగా డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్ ఆవరణలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా అన్ని రంగాల అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- రెండు ఇండ్లలో.. రెండు కార్యాలయాల్లో చోరీ
- మరో ఆరు ఇండ్లలో చోరీకి విఫలయత్నం
- సీసీ కెమెరాలో రికార్డైన ఇద్దరు దొంగల విజువల్స్





నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్‌లో బుధవారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు హల్ చల్ చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న చంద్రపురి కాలనీలో రెండు ఇండ్లలో, రెండు కార్యాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా పక్కన ఉన్న ఇండ్లకు గడియ పెట్టి మరీ వారి పని కానిచ్చేశారు. అంతటితో ఆగకుండా మరో ఆరు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేశారు. సుమారు అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో దొంగలు చోరీకి వచ్చినట్లు సీసీ ఫుటేజ్ దృశ్యాలను బట్టి పోలీసులు చెబుతున్నారు. అయితే చెన్నైలో నివాసం ఉంటున్న వారి ఇంట్లో సుమారు ఎనిమిది లక్షల నగదుతోపాటు విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. కాగా దొంగలు ఇద్దరే ఉన్నారా? ఇంకెవరైనా పాల్గొన్నారా? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

ఎల్బీనగర్‌ను అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఎమ్మెల్యేతో సమావేశమైన కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్
- కాలనీల సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌లోని పలుకాలనీలలో మౌళిక సదుపాయాల కొరత ఎక్కడ ఉందో గుర్తించి సమస్యలను పరిష్కరించేలా నివేదికలను కార్పొరేటర్ సమక్షంలో తయారు చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. డివిజన్లో రెండు రోజుల క్రితం మార్నింగ్ వాక్‌లో పర్యటించిన ఎమ్మెల్యేకు సరస్వతినగర్ కాలనీ, పిండి నారాయణరెడ్డి నగర్, భాగ్యనగర్ ఫేస్.1, భాగ్యనగర్ ఫేస్.2, నార్త్‌ఎక్స్టెన్షన్, శ్రీరామ అయోధ్యనగర్, తుల్జాభవానీనగర్, సత్యదేవ్ ఎంక్లేవ్ కాలనీల నుండి సమస్యలు పరిష్కరించాలని వినతులు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, కరెంట్, ఇతర అధికారులచే ఎమ్మెల్యే సమావేశమైన నేపథ్యంలో డివిజన్‌లో పర్యటించి త్వరలో నివేదిక ఇవ్వాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన చోట నూతన రోడ్లు, మంచినీటి పైప్‌లైన్స్, త్రీఫేస్ కరెంటు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాబోయే రోజుల్లో ఎల్.బి.నగర్ నియోజకవర్గన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు ఆందోజ్ సత్యంచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరెడ్డి ఉదయ్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.శ్రీనివాస్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, దేరంగుల కృష్ణ, నారగోని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు కనకయ్య, కోటేశ్వరరావు, బలరాంరాజు, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు యాజమాన్య హక్కులు కల్పించాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

రక్షణ శాఖ ఏర్పాటు స్థలంలో ఏండ్ల తరబడి నివాసముంటున్న పేదలకు యాజమాన్య హక్కు కల్పించాలని కోరుతూ బుధవారం శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, విలీన కమిటీ సభ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే జి.సాయన్న అసెంబ్లీలో ప్రస్తావించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎయిర్‌పోర్టు అథారిటీ స్థలాల్లో గత నాలుగు దశాబ్దా లుగా పేదలు నివాసం ఉంటున్నారని, వారికి భూ యాజమాన్య హక్కు కల్పించాలని అన్నారు.

అభివృద్ధి పనులతో.. జవహర్‌నగర్‌లో కొత్త కాంతులు



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రగతి పనులతో కార్పొరేషన్‌లో కొత్త కాంతులు సంతరించుకుందని, 30 ఏండ్ల నాటి సమస్యలకు 3 నెలల్లో శాశ్వతంగా పరిష్కారం దక్కిందంటే ఈ ఘనత మంత్రి మల్లారెడ్డికే దక్కుతుందని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్‌లోని ప్రగతి పనులకు రూ.31.50లక్షల నిధులను పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జవహర్‌నగర్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. శ్మశానవాటికల అభివృద్ధికి రూ. 20 లక్షలు, పబ్లిక్ టాయిలెట్‌ల కోసం రూ. 2 లక్షలు, రోడ్ల మరమత్తులకు రూ. 8.50 లక్షలు, ఓపెన్ నాలా అభివృద్ధి కోసం రూ. 1 లక్ష నిధులను కేటాయించామని, ప్రతి డివిజన్‌లో పనులు శరవేగంగా పూర్తవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గురువారం జరగనున్న గణతంత్ర దినోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు, అందరికీ అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట కలెక్టరేట్ ఆవరణలో 74వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ ఆవరణలో మొదటిసారిగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్నందున ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పష్టం



చేశారు. ఈ విషయంలో జాతీయ పతాకావిష్కరణ మొదలుకొని... సభావేదిక, సభాస్థలి, ఆవరణలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అలాగే గణతంత్ర దినోత్సవానికి కలెక్టరేట్‌కు వచ్చే వీఐపీలు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలు, మీడియా ప్రతినిధులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటితో పాటు కుర్చీలు, టెంట్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజల కోసం కూడా ప్రత్యేకంగా కుర్చీలు, షామియానాలు, విద్యుత్తు లైట్లు, తాగునీటి సదుపాయాలు కల్పించామని... కార్యక్రమానికి వచ్చేం దుకు, వెళ్ళేందుకు వేర్వేరుగా దారులు ఏర్పాటు చేసి బ్యారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అనంతరం సభావేదిక అలంకరణతో పాటు ఆయా విషయాలను అధికారులతో చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి నీరజాగాంధీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి తనూజ, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్టూడెంట్ వీసాపై వచ్చి డ్రగ్స్ సరఫరా

- నైజీరియన్ అరెస్టు
- రూ.60వేల విలువగల కొకైన్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టూడెంట్ వీసాపై వచ్చి హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్‌ను హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్ మెంట్, బహద్దూర్‌పురా పోలీసులు కలిసి అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.60వేల విలువగల ఐదు గ్రాముల కొకైన్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ చక్రవర్తి తెలిపిన వివరాల



మేరకు నైజీరియాకు చెం దిన ఓజెంగ్వా ఇమ్మాన్యుయేల్ ఒసోందు స్టూడెంట్ వీసాపై 2016లో నైజీరియా నుంచి ముంబాయ్‌కి వచ్చాడు. సులు వుగా డబ్బులు సంపాదించాలని డ్రగ్స్ సప్లయ్ దారుడిగా మారాడు. తెలిసిన వారికి, కావాల్సిన వారికి డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వచ్చిన నిందితుడు డ్రగ్స్ సప్లయ్ చేసేందుకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌తోపాటు బహద్దూర్‌పురా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్‌లో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ నరసింహ యాదవ్‌తో కలిసి రూ. 42 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్‌లోని ఎల్.బి నగర్‌లో రూ. 21,50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు, అస్మత్ పేట్ ఎస్సీ బస్తీలో రూ. 20.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మెన్ నరేందర్‌గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మెన్ మన్నే ఉదయ్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య వార్డ్ మెంబర్ ఎం నర్సింగ్ రావు, డివిజన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ బాయ్, హరినాథ్, జీహెచ్ఎంసి అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్ డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్, అనంత నగర్, వినోభా నగర్‌లలో రూ.1 కోటి 32 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...కలిసి వచ్చే కార్పొరేటర్లను కలుపుకుని పోతూ ఆయా డివిజన్‌లలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు చెప్పారు. అలాగే ఈస్ట్ కాకతీయ నగర్, వెస్ట్ కాకతీయ నగర్‌ల లోని శ్మశాన వాటికలను కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, అధికా రులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పిం చాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, పిట్ల శ్రీనివాస్, సూరి, ఓం ప్రకాష్, ఉపేందర్ రెడ్డి, ఫరీద్,ప్రభాకర్ రెడ్డి,బాలకష్ణ గుప్త, ఆగమయ్య, సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డి, పిట్లనాగరాజు, బాబు రావు, లత, చంద్రకాంత్, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్ పరిధిలోని అండాల్‌నగర్ కాలనీలో కాలనీవాసులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిం చారు. కాలనీలో పెండింగ్ లో ఉన్నా రోడ్లు పూర్తి చేయా లని, కాలనీ ట్రాన్స్ ఫార్మర్ పోల్స్ షిఫ్టింగ్, వాటర్ సమస్య తదితర సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. కాలనీలో ఇంటర్నల్ రోడ్ల నిమిత్తం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. 30 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, నాయకులు ఆమినుద్దీన్, పిట్ల శ్రీనివాస్, సత్తయ్య, చందు, సంతోష్ నాయుడు, ఆదినారాయణ, సందీప్ గౌడ్, సూరి, బాలకృష్ణ గుప్త, ఆగమయ్య, అండల్ నగర్ అసోసియేషన్ సభ్యులు ఉత్తమ్ టకూర్, శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ, మదన్ మోహన్, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.





జలమండలిలో ఘనంగా ఓటరు దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పర్సనల్ డైరెక్టర్ శ్రీధర్ బాబు ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో ప్రాముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా.. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడికి లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, అర్హత కలిగిన వారందరూ ఓటు హక్కు పొంది దాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, టి.వి.శ్రీధర్, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 20 వ వార్డు గోపికష్ణ కాలనీలో మున్సిపల్ నిధులు రూ 7 లక్షలతో సీసీ రోడ్డు పనులకు చైర్మెన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాల్టీలో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం

- కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లో ఇందిరానగర్‌లో సమస్యలు పరిష్కరించడంలో ఉప్పల్ ఎమ్మెల్యే, అలాగే కార్పొరేటర్ పూర్తిగా వైఫల్యం చెందారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్‌లో సమస్యలపై విస్తృతంగా ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇండ్ల మధ్యల డ్రయినేజీ నీరు పొంగిపొర్లడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తద్వారా ప్రజలకు డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కార్పొరేటర్ ఎన్నికల సమయంలో హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ వచ్చి ఇందిరానగర్ లో నివసిస్తున్న ముస్లిం సోదరులకు శ్మశాన వాటిక కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని వాగ్దానం చేసి ఓట్లు దండుకున్నాడన్నారు. రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా గాని హామీని నెరవేర్చలేదన్నారు. కార్పొరేటర్ ఎన్నికలకు ముందు దోమలపై యుద్ధం అన్నారు కానీ దోమలతో బంధం పెంచుకున్న కార్పొరేటర్ అని ఎద్దేవా చేశారు. తక్షణమే ఇట్టి సమస్యలపై కాప్రా మున్సిపల్ డిసీతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా లేనియెడల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం అఖిల భారతీయ రవిదాసియా ధార్మిక సంఘటన సమన్వయ కమిటీ తెలంగాణ వారి "చలో కాశి బనారస్" గోడపత్రికను లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాచారం డివిజన్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్ గౌడ్, మేడ్చల్ మలాజిగిరి జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ ఎండి రషీద్ (అశూ), ఉప్పల్ ఎస్సీ సెల్ చైర్మెన్ హెచ్‌ఆర్ మోహన్, అలీమ్ భాయ్, యూసుఫ్, హాజీ, మస్తాన్ భాయ్, అజీమ్, అహ్మద్, జహంగీర్, మస్తాన్, జిలాని, షకిల్, జలీల్, సాజిద్, అయూబ్, ఫియస్, ఇస్మాయిల్, కాజా, మునీర్, ముబిన్, గొల్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



గాంధీనగర్‌లో కంటి వెలుగు కార్యక్రమం

నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి గాంధీనగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏడో అధ్యక్షుడు తేజ పాల్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తేజ్‌పాల్ ఇంటింటికి వెళ్లి స్థానికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ వైద్య బృందం కూడా ప్రత్యేకంగా పాల్గొని స్థానికులకు పరీక్షలు నిర్వహించారు.



కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన

- రోజుకు శిబిరాల్లో పాల్గొంటున్న దాదాపు 1500 మంది..
- నియోజకవర్గంలో 9 సెంటర్లు ఏర్పాట్లు

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదల పాలిటీ వరంగా మారింది. నియజక వర్గంలో అధికారులు 9 సెంటర్లలో (మల్కాజిగిరి లోని ఇందిరా మహిళా భవనం, యాప్రాల్ మల్లన్న టెంపుల్, అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం సైనికపురి, దీనదయల్ నగర్ కమ్యూనిటీ హాల్,గాయత్రి నగర్ కమ్యూనిటీ హాల్,ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్ మౌలాలి, అనంత సరస్వతి నగర్ కమ్యూనిటీ హల్,మధుసూదన్ నగర్ కమ్యూనిటీ హాల్, మల్లికార్జున్ నగర కమ్యూనిటీ హాల్) కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. ఒక్కో సెంటర్లలో 8 నుంచి 10 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈ శిబిరాలలో కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారు. దగ్గర చూపు, దూరం చూపు,కంటి జబ్బులకు సంభందించి అన్ని పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కంటి అద్దాలు అందచేస్తున్నారు. ఈ శిబిరం దాదాపు శనివారం, ఆదివారం మినహాయించి 100 రోజుల పనిదినాలు పనిచేస్తుందని శిబిరం నిర్వాహకులు నోముల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ వార్డు కార్యాలయంలో బీఎల్ఓలతో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే ఈ దినోత్సవం ఉద్దేశం అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారతదేశం అని.. కానీ ఇలాంటి దేశంలో పట్టణాల్లో నివసించే కొందరు ప్రజలు ఓటు వేయడానికి ముందుకు రావట్లేదని చెప్పారు. ఓటు హక్కును పొందేందుకు యువత ఆసక్తి చూపట్లేదన్నారు. అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రారంభించిందని తెలిపారు.

నేరేడ్‌మెట్ : మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందు పరిచిన ఒక మనిషికి ఒక ఓటు అనే ప్రాధా న్యత గురించి విద్యార్థు లకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. రాజు, జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ ఎస్ రమేష్, జి. మల్లిక, ప్రభుత్వ పాలన విభాగ అధిపతి డాక్టర్ ఏ చంద్రయ్యలు మాట్లాడారు.



పార్కు స్థలాన్ని కాపాడాలి

- సొసైటీ అధ్యక్షులు సీత ఆంజనేయులు

నవతెలంగాణ-కాప్రా



ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని శ్రీ భావన రుషి హౌసింగ్ సొసైటీలో లేఅవుట్‌లో కొంతమంది వ్యక్తులు 2203 గజాల పైన ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకో వాలని సొసైటీ అధ్యక్షులు సీత ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం సొసైటీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసి సొసైటీ లేఅవుట్ ఏర్పడిందని ఇందులో సూర్యనారాయణ పేరుతో 22 03 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించామని తెలిపారు. స్థానికంగా ఉండే నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కొంతమంది పార్కు స్థలంలో భవనం నిర్మించేందుకు జేసీబీ ద్వారా చెట్లను తొలగించి శుభ్రం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేటర్‌తో శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి విలువైన పార్కు స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే న్యాయ పోరాటానికైనా సిద్ధమని తెలిపారు.

శానిటేషన్ ఉద్యోగిచే అధికారి కారు వాషింగ్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన కారును సర్కిల్ కార్యాలయంలో గార్డెనింగ్ పనులను నిర్వహించే చిరు శాని టేషన్ ఉద్యోగులచే వాషింగ్ చేయించడం చర్చనియాంశంగా మారిం ది. దేశ స్వాతంత్రం వచ్చి రిపబ్లిక్ డే ఉత్సవాలను నిర్వహిం చుకునే ఒక రోజు ముందే ఇలాంటి పనులు చేయడం అవమానకరం. కాప్రా సర్కిల్ పరిధిలోని శానిటేషన్ విభాగంలో అధికారులు ఇష్టానుసారంగా పారిశుధ్య కార్మికులను వినియోగిస్తున్నారని ఆరోప ణలు వస్తు న్నాయి. ప్రజా ప్రతినిధుల ఇండ్లలో పనిచేయించడం కాకుం డా, ఉన్నత స్థాయి అధికా రులు ఇంట్లో కూడా పారిశుధ్య కార్మికులతో పనులను నిర్వహిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఏఎమ్ హెచ్ఓ, సానిటరీ సూపర్వైజర్, జవాన్లు, ఎస్ఎఫ్ఐలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీలో సిబ్బంది వేతనాలనే కాజేస్తున్నారని, కాప్రా సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రములపై అధికారులు దృష్టిని కేంద్రీకరించడం లేదని తెలుస్తోంది. జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ ప్రజాప్రతినిధుల అండతో , ఇక్కడ పనిచేసే ఏఎమ్‌హెచ్ వన్ బదిలీ చేయించి ఆస్థానంలో బాధ్యతను స్వీకరించడంపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇక సర్కి ల్‌లో ఆరు డివిజన్లకు ముగ్గురైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా ఒకరే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పం దించి పారిశుధ్య కార్మికుల పట్టి చాకిరిపై, అవినీతి అక్రమాలపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవినీతి అక్రమాలు పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్మికులకు అండగా సీఐటీయూ

కాప్రా పారిశుధ్య కార్మికులకు అండగా సీఐటీయూ పోరాడుతుంది. పారిశుధ్య కార్మికునితో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కారును వాషింగ్ చేయించడం బాధాకరం దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి, పారిశుద్ధ కార్మికుల వేతనాలు చెల్లించడంలో కూడా అక్రమాలు జరుగుతున్నట్టు తమ దష్టికి వచ్చింది. దీనిపై ఉన్నత అధికారుల దష్టికి తీసుకెళ్తాం.

– సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ
ఎల్బీనగర్
గురువారం 26 జనవరి 2023

మితిమీరుతున్న ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు

నవతెలంగాణ -కాప్రా



ఎమ్మెల్యే బేతి శుభాష్‌రెడ్డి అనుచరుడి ఆగడాలు రోజురోజుకు మితినీరిపోతున్నాయి. ఎమ్మెల్యే అనుచరుడిగా చాలామని అవుతున్న వంశీరాజ్ గత రెండుమూడేండ్లుగా చర్లపల్లి వాసులని భయందోళనకు గురిచేసి వసూళ్లకు పాల్పడుతున్నాడు. మంగళవారం సాయంత్రం చర్లపల్లి సమీపంలో రైల్వే స్టేషన్ దగ్గర శ్రీ బాలాజీ చల్లారామ్ మిఠాయి షాపులో మార్వాడిపై దాడి చేశాడు. గతంలో కూడా వంశీరాజ్, అతని అనుచరుల ఆగడాలు చాలా ఉన్నాయి. వంశీరాజ్ అతని సోదరుడు అభిషేక్ వారి అనుచరులని వెంటనే కఠినంగా శిక్షించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

యువతకు ఓటు హక్కు గొప్ప ఆయుధం:విశ్వనాథ్

నవతెలంగాణ -జవహర్ నగర్



రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన ఓటుహక్కు గొప్ప ఆయుధమని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం కార్పొరేషన్‌లోని జవహర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం





నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వారాసిగూడ నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ పాఠశాల వ్యవస్థాపకులు కోట్ల నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, జీహెచ్‌ఎంసీ అధికారులు మోహన్ రెడ్డి, రోజా తదితరులు పాల్గొని..'భారత దేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మనదేశ ప్రజాస్వామ్య



సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ప్రశాంతి ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, కులం, వర్గం, భాష ఎటువంటి ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తాం' అని ప్రతిజ్ఞ చేశారు. ఇదే విషయాన్ని ప్రజల చేత చదివించి ప్రమాణం చేయించారు. ఓటు ప్రాముఖ్యతను, ఓటరు విలువను ప్రజాస్వామ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఈ సందర్భంగా చర్చా కార్యక్రమం నిర్వహించారు.

ఓటుహక్కు ప్రతి పౌరుడి బాధ్యత

సంతోష్ నగర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్ నగర్ మూడు ఆలయాలు జీహెచ్‌ఎంసీ అధికారులు సిబ్బంది కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. 'ఓటు.. మన హక్కు.. దాన్ని పొందినందుకు దేశపౌరులుగా గర్విద్దాం' అంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. హైదరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఫోన్ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు పొందే విధానాన్ని వివరిస్తూ రూపొందించిన గోడపత్రికను జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు సోనీ శ్రీలత పావని లీల గోవిందు రాజు స్వాతి కార్యకర్తలు అభిమానులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు

సంతోష్ నగర్: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఐఎస్ సదన్ డివిజన్లో సంఘం లక్ష్మీబాయి కాలేజీలో విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు మన హక్కు దాన్ని రూపొందించినందుకు దేశ పౌరులుగా గౌరవిద్దాం అంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు, కేంద్ర ఎన్నికల సంఘం ఫోన్ నెంబర్ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు పొందే విధానాన్ని వివరిస్తూ రూపొందించిన గోడపత్రికను జీహెచ్‌ఎంసీ అధికారులు నాయకులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు, బీజేపీ నాయకులు శరత్ చంద్ర, సుధీర్, అజయ్, జీహెచ్‌ఎంసీ అధికారులు అసిస్టెంట్ కమిషనర్ మోహన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, స్థానిక నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం

హయత్ నగర్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జ్యోత్స్నప్రభ మాట్లాడుతూ ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఒత్తిడులకు, ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలని, ఉత్తమ పాలకులను ఎన్నుకొని దేశాభివృద్ధిలో తమ వంతు పాత్రను నిర్వహించాలని కోరారు. ఓటు వేయడం మన విధి అని మనవిధిని మనం సక్రమంగా నిర్వర్తించడం కూడా దేశభక్తిని కలిగి ఉండడమేనని అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించిన రాజనీతిశాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ జాహెదా బేగం, రాజనీతిశాస్త్ర విద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞను ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషలలో అందరితో చదివించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారుకి, డాక్టర్ సురేష్, మల్లేశం, సుబ్రహ్మణ్యం, డాక్టర్ శంకర్, డాక్టర్ శశిధర్, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ సునీత, అవేస్ మొహియుద్దీన్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఘట్కేసర్ :అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ యూనిట్ -1 ఆధ్వర్యంలో 13వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.సి.మల్లేశం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.నవీన్ మాట్లాడుతూ జాతీయ ఎన్నికల కమిషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పనిసరిగా వినయోగించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఎస్ కె.నాయబ్ రసూల్, మధుకర్ పటేల్, వాలంటీర్లు అఖిల, సల్మా, సింధు, శివ, శాంత తధితరులు పాల్గొన్నారు.





వైకుంఠధామాన్ని పరిశీలించిన వైస్ చైర్మెన్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీలోని 17వ వార్డ్‌లో మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదేశానుసారం చిన్న చెరువు దగ్గర నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను బుధవారం వైస్ చైర్మన్ పలువుల మాధవరెడ్డి పరిశీలించారు. అధికారులు పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఎగ్జిక్యూట్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి ఎస్ ఈ వెంకటేశ్వర్లు, ఏఈ నరేష్, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి వైకుంఠధామం పనులను పరిశీలించి త్వరగా పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్ వెంకటేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బేతాళ నర్సింగ్ రావు, చందుపట్ల వెంకట రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వేమానరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు బర్ల హరి శంకర్ ముదిరాజ్, పల్లె విజయ్ గౌడ్, ఎండి సిరాజ్, కందకట్ల మాధవరెడ్డి, అనుభయ్, బానుక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

యువ నాయకులు కార్తిక్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజంలోని యువతి, యువకులకు క్రీడలతోనే మానసికోల్లాసంతోపాటు మనోధైర్యం కలుగుతుందని రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పటోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలో వాదీ-ఏ ముస్తఫా కాలనీలో క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం యువ నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలని, అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాలని కోరారు. క్రీడలతోనే యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ రిప్రెజెంటేటివ్ వైస్ చైర్మన్ యూసఫ్ పటేల్, మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ జహంగీర్, కౌన్సిలర్ శంషుద్దీన్, షేక్ అఫ్జల్, సౌద్ అవల్గి, మజర్ అలీ, అబ్దుల్ రావుఫ్, షర్ఫుద్దీన్, జల్పల్లి మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షులు ఉస్కెమూరి నిరంజన్, యూత్ నాయకులు మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, బవజీర్ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థి అరెస్టు

508గ్రాముల గంజాయి,10వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం

నవతెలంగాణ-హయత్ నగర్



గంజాయి అమ్మడం, కొనడం, సేవించడం చట్టరీత్యా నేరం అని తెలిసి మత్తుకు బానిసైన విద్యార్థులు గంజాయితో పట్టుబడడం చాలా బాధాకరమైన విషయమని ఎల్బి నగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు. బుధవారం నిందితుడి వివరాలు వెల్లడించారు. ఎల్బి నగర్ చింతల్ కుంటలో నివాసముంటున్న పందెన సంజీవ్ కుమార్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా. నిజామాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తి నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న చంద్రపురి కాలనీలో విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 508గ్రాముల గంజాయి, 10వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బాలికల విద్యే ప్రగతికి మెట్లు

నవతెలంగాణ-అంబర్‌పేట



బాలికల విద్యే ప్రగతికి మెట్లు అని డా.హిప్నో పద్మా కమలాకర్, లయన్ కృష్ణవేణి, లయన్ పి.స్వరూపా రాణి తెలిపారు. జనవరి 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బాలికలు ఆరోగ్యంగా ఉండటం కోసం డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్, ప్రకృతి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ముషీరాబాద్ రైయిన్ బో హెూమ్‌లో విటమిన్ టాబ్లెట్లు, పోషకాహారం, పుస్తకాలు అందేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు చదువుకుంటే ఈ సమాజమే అభివృద్ధి సాధిస్తుందన్నారు. బాలికల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి, వారి జీవితాల్లో వారు ఎదుర్కొంటున్న అసమానతలను ఎత్తిచూపడానికి భారతదేశంలో జనవరి 24న బాలికా దినోత్సవం జరుపు కుంటున్నాం అని తెలిపారు. భారతీయ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి అవగాహన కల్పించడానికి, ఆడపిల్లల హక్కులు విద్య, ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు. ఈ రోజు బేటీ బచావో బేటీ పడావో, ఆడపిల్లను రక్షించు కోవాలన్నారు. భారతదేశంలోని బాలికలకు మద్దతు ఇవ్వడం, చదివించడం, అవకాశాలను అందించాలన్నారు. భారతదేశంలో లింగ అసమానత అనేది ప్రధాన సమస్యలలో ఒకటి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవభారత లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు జే.టి.విద్యా సాగర్, అధ్యక్షులు గోపాలకృష్ణ, రమణమ్మ సదాలక్ష్మి, వరలక్ష్మి బాల బాలికలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రాండ్ నర్సరీ మేళా

నవతెలంగాణ-అంబర్‌పేట

నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో నేటి నుంచి 13వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఆల్ ఇండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ షో అందుబాటులోకి రానుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ షోలో వివిధ రకాల మొక్కలతో పాటు హార్టీకల్చర్, అగ్రీకల్చర్ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయల తోటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని మేళా ఇన్‌చార్జి ఖాలీద్ అహ్మద్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా కోల్ కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై, డార్జిలింగ్, తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్ 150కు పైగా స్టాల్స్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. ఇంపోర్టెడ్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్ కిచెన్, అవుట్ డోర్, ఎక్సోటిక్ టిక్, బల్బ్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, నర్సరీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మేళాను మంత్రులు ప్రారంభిస్తారని ఖాలీద్ అహ్మద్ వివరించారు.



మహిళలు అని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి కావాల్సిన అవసరం ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్. గౌతమ్ రావు అన్నారు. బుధవారం బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ మహిళా మోర్చా సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంమహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం కృషి చేయడం లేదన్నారు. సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు కొంతం దీపక, సరళ, మహిళ మోర్చా పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'షోరూమ్ ఆన్ వీల్స్' ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీఎం మాడ్యులర్ వారి కొత్త ఆవిష్కరణ "షోరూమ్ ఆన్ వీల్స్"ని హైటెక్ సిటీలో విజయవంతంగా ప్రదర్శించింది. ఈ కార్యక్రమం మూడు రోజులు జరిగింది. దాదాపు 10వేల మంది ఈ ప్రీమియం ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఇది గొప్ప విజయం సాధించింది. గౌరవనీయమైన ఈవెంట్‌ను అలంకరించిన ఆర్కిటెక్చర్, కన్స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ రంగాల్లోని ప్రముఖ వ్యక్తులను చూసింది. జయంత్ జైన్, సీఈఓ, జీఎం మాడ్యులర్ మాట్లాడుతూ "అసాధారణమైన వాటి ద్వారా జీఎం భవిష్యత్తు ఉత్పత్తులతో నిమగ్నమై యాక్షన్-ప్యాక్డ్ ఈవెంట్‌ను అలంకరించిన సందర్శకుల నుంచి చాలా శ్రద్ధ, అద్భుతమైన ప్రతిస్పందనను అందుకున్నందుకు మేం గౌరవంగా, సంతోషిస్తున్నాం. షోరూమ్ ఆన్ వీల్స్ కాన్సెప్ట్." కార్యాచరణ, యాక్సెసిబిలిటీని పొందుపరచడం ద్వారా వినియోగదారుల షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరిచే మార్గాల కోసం మేం ఎల్లప్పుడూ వెతుకుతూ ఉంటాం" అని తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-అంబర్‌పేట









ప్రజలకు ఇబ్బందుల్లేకుండా కంటి వెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించిన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీధర్, ఏవి ప్రవీణ్ కుమార్, వీణ, అనిల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, ఆమనూరి సతీష్, పాక నర్సింగ్, సంతోష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని బుదవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని గురుబ్రహ్మనగర్ బస్తీ దవాఖానాలో జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, లైబ్రరీ చైర్మెన్ ప్రసన్న కుమారి, డీఎంసీ రజనీకాంత్ రెడ్డి, వైద్యులు అనురాధ, నాగా కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రామ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం బాగ్ లింగంపల్లి నైబర్ హుడ్ కాలనీ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో నైబర్ హుడ్ కాలనీ అధ్యక్షులు సిరిగిరి కిరణ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిరిగిరి శ్యాం కుమార్, కార్తిక్ యాదవ్, సత్యనారాయణ, సిద్ధిఖీ, సాయి యాదవ్, రాజేష్, కల్పనా, రేఖ, వెంకటేష్ పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్ : కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నాంపల్లి క్లస్టర్ ఎస్ఎహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు అన్నారు. బుధవారం క్లస్టర్ పరిధిలోని ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హిందీ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలు తరలివచ్చి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు వారికి వైద్యులు పరీక్షించి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రిన్, డాక్టర్ మురళీధర్, పీహెచ్ఎన్ సుజాత, ఏఎన్ఎం జ్యోత్స్న, విమల, డిఈవో నవీన్, ఆప్తలజీ యాదగిరి, ఆశా వర్కర్లు రాఖీ బాయి, అండాలమ్మ, గాయత్రి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భక్తరామదాసు జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-అడిక్‌మెట్

హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ భద్రాచలం రామదాసు 390వ జయంతి ఉత్సవాలు బుధవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న శ్రీ భక్తరామదాసు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భక్తరామదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హరిహరా ఫౌండేషన్ అధ్యక్షుడు మారగాని శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ వారి ఆధ్వర్యంలో నాదస్వర మందం కచేరి నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు డాక్టర్ రమాప్రభ ఆధ్వర్యంలో వారి విశ్వబృందం చేత నవరత్న కీర్తనలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కష్ణమోహన్‌రావు మాట్లాడుతూ 12 ఏండ్లు జైలుజీవితం గడిపిన భక్తరామదాసు 300 పైగా కీర్తనలు రచించి గానం చేశారన్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రవెంకటేషు మాట్లాడుతూ భక్తరామదాసు జయంతి ఉత్సవాలను ప్రతి జిల్లాల్లో పేలా భాషాసాంస్కృతికశాఖ చొరవతీసుకోవాలని సూచించారు. నేటి యువత భక్తరామదాసు చిత్తవద్దిన నిజాయితీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హరిహర పౌండేషన్ అధ్యక్షుడు మారగాని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మూడేండ్లుగా శ్రీ భక్త రామదాసు జయంతి ఉత్సవాలను ట్యాంక్ బండ్ పై నిర్వహిస్తున్నామన్నారు. భక్త రామదాసు కీర్తనలకు బహుళ ప్రాచుర్యం కల్పించేందుకు శ్రీహరిహర ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించగా నాయకులు భవానీ శంకర్, అతిది మాసపత్రిక సంపాదకులు ఎం.వెంకటేశ్వర్‌రావు, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె.రామదాసు, కంచర్ల కటరమణ, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నవతెలంగాణ-అడిక్‌మెట్









ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడండి అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని వెయిట్స్ అండ్ మెషర్మెంట్స్ పోలింగ్ బూత్ కేంద్రం వద్ద నూతన ఓటర్లు, సిబ్బంది, బీజేపీ నాయకులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్ కుమార్, మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఆకుల సురేందర్, సాయి కుమార్, బీజేవైఎం నాయకులు గోపి, ఆనంద్‌రావు, అభిషేక్, అధికారులు కె.రమేశ్ సూపర్వైజర్, యాదగిరి, సి.రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, విజయ్, బిల్ కలెక్టర్ పాల్గొన్నారు.

ధూల్‌పేట్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ సిటీ కాలేజీ, చార్మినార్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిటీ కాలేజీ లియో క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి తరపున ఓటు హక్కు, ప్రజాస్వామ్యంపై ఓటర్లను చైతన్యపరిచేందుకు 300 మీటర్ల మేరకు మువ్వన్నెల జెండాతో రెండు వందల మంది విద్యార్థులు నినాదాలతో కాలేజీ నుంచి గోషామహల్ భగత్ సింగ్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాల భాస్కర్ జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. లయన్ హైదర్ అలీ, లయన్ మునవార్ హుస్సేన్, లయన్ ఆఫ్సాన్ ఖాద్రి, లయన్ సిద్దికి అతిథులుగా పాల్గొని ఓటర్ నమోదు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిటీ కాలేజీ లియో క్లబ్ ఫాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుపతి, ఎన్సిసి కెప్టెన్ కష్ణవేణి, ఎన్సిసి పి ఓస్ నాగరాజు, జయ కాగాడా, కృష్ణ చంద్ర, సుధాక్షణ సిటీ కాలేజీ లియో క్లబ్ ప్రెసిడెంట్ లియో ప్రవీణ్ నాయక్, కార్యదర్శి లియో ఆదిత్య, ట్రెషర్ లియో నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూ : సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్ : సామాజిక న్యాయం ఓటు చైతన్యం ద్వారానే సాధ్యమవుతుందని ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, గోపి బోయ, పిట్ల నగేష్ ముదిరాజ్, మామిడాల రాజు, స్వామి, నగేష్, జగదీష్ యాదవ్, సత్యవతి, కామేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.